thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 156 | జగిత్యాల గురువారం 10 సెప్టెంబర్, 2026 | ఎడిటర్ : మొహమ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

మంధాన మరో మైలురాయి..




11

## రైల్వే విస్తరణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- ఏడు రద్దీ కారిడార్లలో నాలుగు లైన్లు
- 11 వేల కోట్లతో మల్టీట్రాకింగ్ పనులు
- ఐదు రాష్ట్రాల్లోని 14 జిల్లాలకు ప్రయోజనం
- తెలుగు రాష్ట్రాలకూ భారీగా లబ్ధి

4



## మా ఆదేశాలనే ధిక్కరిస్తారా.. అంత ధైర్యం ఎలా వచ్చింది?

విద్యార్థికి నోటీసుపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- చర్యలు వద్దని చెప్పినా ఎలా ఇచ్చారని ప్రశ్న
- మెజిస్ట్రేట్ తీరుపై ధర్మాసనం మండిపాటు
- జిల్లా అధికారుల నుంచి వివరణ కోరనున్న కోర్టు

నోటీసును వెనక్కి తీసుకున్నట్లు వెల్లడి

4



# కుట్రదారులెవరైనా వదిలిపెట్టం!

## వరుస ఘటనలపై సమగ్ర విచారణ



దోషులపై క్రిమినల్ కేసులు ■ స్పీకర్‌కు ప్రభుత్వం అండగా ఉంటుంది

ప్రజా సమస్యలపై చర్చను అడ్డుకున్నారని ఆరోపణ

అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

శాసనసభ వర్షాకాల సమావేశాల ప్రారంభంలో చోటుచేసుకున్న కుట్రపూరిత సంఘటనలను ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని సభా నాయకుడు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ఉదంతంలో భాగస్వాములైన బాధ్యులందరిపై సమగ్ర విచారణ జరిపించి, క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని ఆయన ప్రకటించారు. సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారిని ఉద్దేశించి దుర్భాషలాడటం, దళితులు నడిచిన నేలను శుద్ధి చేయడాన్ని నిరసిస్తూ బుధవారం శాసనసభలో జరిగిన సుదీర్ఘ చర్చకు సీఎం సమాధానమిచ్చారు.

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు):** శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో చోటుచేసుకున్న ఘటనల వెనుక కుట్ర ఉందని, అందుకు బాధ్యులైన వారందరిపై సమగ్ర విచారణ జరిపించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దర్యాప్తులో దోషులుగా తేలిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని స్పష్టం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ఈ అంశాలపై బుధవారం శాసనసభలో జరిగిన సుదీర్ఘ చర్చకు సభా నాయకుడిగా సీఎం సమాధానమిచ్చారు. స్పీకర్‌కు ప్రభుత్వం, శాసనసభ అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. జరిగిన ఘటనలతో మానసిక ధైర్యం కోల్పోవద్దని స్పీకర్‌ను కోరారు. సభాపతి మనసును గాయపరిచిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.

మిగతా 2 లో

## దళితులు నడిచిన నేలను శుద్ధి చేస్తారా?

- ఎర్రవల్లి ఘటనపై సీఎం రేవంత్ ఆగ్రహం
- దవ్వులతో నిరసన తెలపడం ప్రజాస్వామ్య హక్కు
- శుద్ధీకరణ చేయడం అమానవీయమని మండిపాటు
- ఫామ్‌హౌస్ వేదికగా కుట్రలు రచించారని ఆరోపణ
- ప్రజాస్వామ్య వ్యవస్థనే అవమానించారన్న సీఎం

2







# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్!

## శాసనసభ నుంచి కేటీఆర్, హరీశ్ సహా 22 మంది సస్పెండ్

సెషన్ మొత్తానికి సభ నుంచి వేటు

- శ్రీధర్‌బాబు తీర్మానానికి స్పీకర్ ఆమోదం
- నినాదాలతో సభకు ఆటంకమంటూ చర్య
- స్పీకర్‌ను కలువకుండా అడ్డుకున్న మార్షల్స్

2

శాసనసభ వర్షాకాల సమావేశాల్లో బీఆర్ఎస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన 22 మంది ఎమ్మెల్యేలపై సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు పడింది. కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలందరినీ ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

## కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ నేతలపై కేసు

2

- మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో నమోదు
- అసెంబ్లీ గేటు వద్ద ఘటనపై పోలీసుల చర్య
- సీసీటీవీ, వీడియోల పరిశీలనకు విజ్ఞప్తి
- సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో దర్యాప్తు





## మహిళా ఎమ్మెల్యేలను తోసింది సొంత నేతలే!

3

- వీడియోలు విడుదల చేసిన మంత్రి సీతక్క
- గంగుల, సుధీర్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు
- సబిత, సునీత, కోవ లక్ష్మిని నెట్టేశారని వ్యాఖ్య

## మా ఎమ్మెల్యేలపై దాడి.. మాపైనే కేసులా?

- గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు
- పోలీసుల తీరుపై ఆధారాలు ఇచ్చామన్న కేటీఆర్
- సబిత, సునీత ఘటనలను వివరించిన నేతలు
- హామీల అమల్లో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపణ
- రాష్ట్ర పరిస్థితులపై జోక్యం చేసుకోవాలని వినతి

3





## బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

- ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..
- తెలంగాణలో అధికారంలోకి వస్తాం
- కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

3

## ఆయుష్ విద్యార్థులకు 'డబుల్' ధమాకా!

- హౌస్ సర్జన్లకు రూ.29,792
- పీజీలకు రూ.74,482 స్టైఫండ్
- భారీ పెంపుతో ప్రభుత్వం జీవో
- అల్లోపతి మెడికోలతో సమానంగా చెల్లింపులు
- మంత్రి దామోదర్‌కు విద్యార్థుల కృతజ్ఞతలు

రాష్ట్రంలోని ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి (ఆయుష్) విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆయుష్ మెడికోల స్టైఫండ్‌ను అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా భారీగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

2





## భారతరత్నకు 'సర్' కష్టాలు

- ఒక్క అక్షరం తేడాతో చిక్కులు!
- పాత, కొత్త ఓటరు జాబితాల్లో పేరు సరిపోలలేదని సమాచారం
- ఈసీ నోటీసులు పంపినట్లు ప్రచారం
- నోటీసులేవీ అందలేదన్న రావు ప్రతినిధి
- గతంలో పద్మశ్రీ హాజబ్బకూ ఇదే సమస్య

4



# ఆయుష్ విద్యార్థులకు 'డబుల్' ధమాకా!

## హౌస్ సర్జన్లకు రూ.29,792

## పీజీలకు రూ.74,482 స్టైఫండ్

**భారీ పెంపుతో ప్రభుత్వం జీవో**

**అల్లోపతి మెడికోలతో సమానంగా చెల్లింపులు**

**మంత్రి దామోదర్‌కు విద్యార్థుల కృతజ్ఞతలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు):**
రాష్ట్రంలోని ఆయుర్వేదం, హోమియోపతి, యునాని, నేచురోపతి (ఆయుష్) విభాగాల్లోని హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆయుష్ మెడికోల స్టైఫండ్‌ను అల్లోపతి వైద్య విద్యార్థులతో సమానంగా భారీగా పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన వివరాల ప్రకారం హౌస్ సర్జన్లకు ఇప్పటివరకు నెలకు ఇస్తున్న రూ. 13,754 స్టైఫండ్‌ను రూ. 29,792 కు పెంచగా, పీజీ విద్యార్థుల స్టైఫండ్‌ను రూ. 34,385 నుంచి ఏకంగా రూ. 74,482కు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం మధ్యాహ్నం సచివాలయంలో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలసిన ఆయుష్ విద్యార్థులు, యువ వైద్యులు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి విద్యార్థులకు పెంచిన స్టైఫండ్‌కు సంబంధించిన జీవో కాపీని స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన మంత్రి దామోదర్ రాజనర్సింహ వారికి శుభాకాంక్షలు తెలుపుతూ, సమాజంలో గుణాత్మక మార్పుకు విద్యే పునాది అని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం చదువుతో ఆగిపోకుండా ఆయుష్ వైద్య విధానాలపై శాస్త్రీయ పరిశోధనలు చేసి, కొత్త చికిత్సా పద్ధతులను ప్రపంచానికి పరిచయం చేయాలని పిలుపునిచ్చారు. గత రెండున్నరేళ్ల పాలనలో ఆయుష్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక విప్లవాత్మక చర్యలు తీసుకుందని మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 700 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లు, 138 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకంతో పాటు సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి, వికారాబాద్ జిల్లాల్లో 50 పడకల ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆసుపత్రులను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. అలాగే కరీంనగర్‌లో రూ. 15 కోట్ల వ్యయంతో మరొక 50 పడకల ఆయుష్ ఆసుపత్రి నిర్మాణం వేగంగా సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా తమ స్టైఫండ్ పెంచకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం తమ సమస్యను గుర్తించి ఊరట కలిగించిందని విద్యార్థులు ఈ సందర్భంగా ఆవేదనను, సంతోషాన్ని పంచుకున్నారు. తమ విజ్ఞప్తిని ఆలకించి స్టైఫండ్ రెట్టింపు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు ఆయుష్ విద్యార్థులు, డాక్టర్ల సంఘాల ప్రతినిధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఎరువుల పంపిణీ యాప్‌ను రద్దు చేయం

**ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసమే యాప్**

**రైతాంగ విస్తృత ప్రయోజనాలకై కొనసాగింపు**

**సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తున్నాం..**

**శాసనమండలిలో మంత్రి తుమ్మల సమాధానం**



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు):** యూరియా, ఇతర సబ్సిడీ ఎరువులు నిజమైన రైతులకు పారదర్శకంగా అందాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన యాప్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ రద్దు చేసే ప్రసక్తే లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమగ్రంగా సమాధానమిచ్చారు. సాంకేతిక సమస్యల కారణంగా రైతులకు ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, సిగ్నల్స్ లేని ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్లు లేని రైతుల కోసం కామన్ సర్వీస్ సెంటర్లు, మీ-సేవ కేంద్రాలు, రిటైల్ పాయింట్ల వద్ద వాలంటీర్ల ద్వారా ప్రత్యామ్నాయ బుకింగ్ సౌకర్యాలు కల్పించామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఈ డిజిటల్ విధానాన్ని ఆదర్శంగా తీసుకునే కేంద్ర ప్రభుత్వం 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ యాప్'ను దేశవ్యాప్తంగా తెచ్చిందని, దానినే రాష్ట్రంలో సెప్టెంబర్ 2 నుంచి అమలు చేస్తున్నామని చెప్పారు. గతంలో కేటాయించిన యూరియా పక్కదారి పట్టడం, బ్లాక్ మార్కెటింగ్ జరగడం వంటి అక్రమాలకు చెక్ పెట్టడానికే ఈ మార్పు తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రంలో యూరియా కొరత లేదని, అంతర్జాతీయ పరిస్థితుల వల్ల దిగుమతుల్లో ఆలస్యమైనా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నిల్వలను 23 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచామని చెప్పారు. కౌలు రైతులకు కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎరువులు అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు.

# కుట్రధారులెవరైనా వదిలిపెట్టం!

మొదటి పేజీ తరువాయి

ఉసిగొల్పబడిన కొందరు వ్యక్తులు అధికారులపై దాడులకు పాల్పడటంతో పాటు సభాపతి స్థానాన్ని అవమానించేలా వ్యవహరించారని సీఎం ఆరోపించారు. స్పీకర్ తల్లిని సైతం అవమానించేలా వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఇది యాదృచ్ఛికంగా జరిగిన ఘటన కాదని, ఒక పథకం ప్రకారం దురుద్దేశంతో జరిగిన చర్యగా భావిస్తున్నామని పేర్కొన్నారు. సభాపతి స్థానాన్ని అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలను దేశంపై జరిగిన ఉగ్రదాడులతో పోలుస్తూ సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యున్నతమైన సభాపతి స్థానంపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని ఉపేక్షించలేమన్నారు.

**'తల్లిని అవమానించడం దారుణం'**

మన సమాజంలో మహిళకు అత్యున్నత స్థానం ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. శక్తికి ప్రతీకగా అపరకాళి, భద్రకాళి అని.. దేశాన్ని భారతమాతగా, రాష్ట్రాన్ని తెలంగాణ తల్లిగా గౌరవించుకుంటామని చెప్పారు. అలాంటి తెలంగాణ గడ్డపై ఒక తల్లిని అవమానించేలా వ్యవహరించడం దారుణమన్నారు. సభాపతికి జరిగిన అవమానాన్ని ఒక వ్యక్తికి జరిగిన అవమానంగా మాత్రమే చూడలేమని, అది సమాజాన్ని అవమానించడమేనని వ్యాఖ్యానించారు. దోషులను తెలంగాణ సమాజం ఉపేక్షించదన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపేందుకు అనేక మార్గాలు ఉన్నాయని, కానీ వ్యక్తిగతంగా మనసును గాయపరిచే వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.

**'ప్రజా సమస్యల చర్చను అడ్డుకున్నారు'**

సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమైన శాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చించాలని ప్రభుత్వం భావించిందని సీఎం తెలిపారు. విద్యారంగ సమస్యలు, ధరణిలో జరిగినట్లు ప్రభుత్వం ఆరోపిస్తున్న అక్రమాలు, 22--ఏ భూముల సమస్యలతో పాటు ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అయితే ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా ఉద్దేశపూర్వకంగా అడ్డుకునే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. సభను సజావుగా నిర్వహించేందుకు సభ్యులందరూ సహకరించాలని కోరారు. "సభాపతి స్థానాన్ని అవమానించిన ఘటనతో పాటు సమావేశాల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలన్నింటిపైనా సమగ్ర విచారణ జరుగుతుంది. కుట్ర చేసినవారు, ఉసిగొల్పినవారు, అమలు చేసినవారు ఎవరైనా చట్టం ముందు బాధ్యత వహించాల్సిందే" అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.



# దళితులు నడిచిన నేలను శుద్ధి చేస్తారా?

**ఎర్రవల్లి ఘటనపై సీఎం రేవంత్ ఆగ్రహం**

**డప్పులతో నిరసన తెలపడం ప్రజాస్వామ్య హక్కు**

**శుద్ధీకరణ అమానవీయమని మండిపాటు**

**ఫామ్‌హౌస్ వేదికగా కుట్రలు రచించారని ఆరోపణ**

**ప్రజాస్వామ్య వ్యవస్థనే అవమానించారన్న సీఎం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు):** స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు జరిగిన అవమానంపై డప్పుల చప్పుళ్లతో ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన దళితుల పట్ల అవమానకరంగా వ్యవహరించడం అమానవీయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ సమీపంలో దళితులు నడిచిన ప్రదేశాన్ని బీఆర్‌ఎస్ నేతలు 'శుద్ధీకరణ' చేయడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. స్పీకర్‌కు జరిగిన అవమానాన్ని నిరసిస్తూ దళితులు డప్పులతో తమ ఆవేదనను వ్యక్తం చేసేందుకు ప్రయత్నించారని సీఎం పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, అలాంటి వారిని అవమానించేలా వ్యవహరించడం సమర్థనీయం కాదన్నారు. వారు నడిచిన ప్రదేశాన్ని శుద్ధీకరించారన్న ఘటనను తీవ్రంగా తప్పుబట్టారు. శాసనసభ కార్యకలాపాలను అడ్డుకోవాలనే దురుద్దేశంతో ఫామ్‌హౌస్‌ను వేదికగా చేసుకుని కుట్రలు రచించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఉసిగొల్పబడిన కొందరు వ్యక్తులు సభాపతి స్థానాన్ని, ఆయన తల్లిని అవమానించేలా వ్యవహరించడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ పరిణామాలు యాదృచ్ఛికంగా జరిగినవి కావని, ఒక పథకం ప్రకారమే చోటుచేసుకున్నాయని సీఎం ఆరోపించారు. సభాపతి స్థానాన్ని కించపరిచేలా వ్యవహరించడం ఒక వ్యక్తిని అవమానించడం కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థనే అవమానించడమని పేర్కొన్నారు. "దళితులు నడిచిన ప్రదేశాన్ని శుద్ధీకరించడమంటే వారి ఆత్మగౌరవాన్ని కించపరచడమే. ఇలాంటి వివక్షాపూరిత చర్యలకు తెలంగాణ సమాజంలో చోటుండకూడదు" అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



# బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్!

## శాసనసభ నుంచి కేటీఆర్, హరీశ్ సహా 22 మంది సస్పెండ్

**సెషన్ మొత్తానికి సభ నుంచి వేటు**

**శ్రీధర్‌బాబు తీర్మానానికి స్పీకర్ ఆమోదం**

**నినాదాలతో సభకు ఆటంకమంటూ చర్య**

**స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లగా అడ్డుకున్న మార్షల్స్**



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు):** శాసనసభ వర్షాకాల సమావేశాల్లో బీఆర్‌ఎస్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. పార్టీకి చెందిన 22 మంది ఎమ్మెల్యేలపై సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు పడింది. బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలందరినీ ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. మూడో రోజు సభ ప్రారంభమైన వెంటనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు 'వి వాంట్ జస్టిస్' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. సభా కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొంటూ వారిని సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి సభ ఆమోదం తెలపడంతో స్పీకర్ సస్పెన్షన్‌ను ప్రకటించారు.

**22 మందిపై ఒకేసారి వేటు**

కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, అనిల్ జాదవ్, కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, కోవ లక్ష్మి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజయుడు, కె.సంజయ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, కేపీ వివేకానందపై సస్పెన్షన్ వేటు పడింది. సస్పెన్షన్ అనంతరం స్పీకర్‌ను కలిసేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను మార్షల్స్ అడ్డుకున్నట్లు సమాచారం.

**'సభాపతిని అవమానించడం సరికాదు'**

బీఆర్‌ఎస్ సభ్యుల తీరుపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. సభాపతి సూచనలు చేసినప్పుడు వాదనలకు దిగకుండా సభ సజావుగా నడిచేందుకు సహకరించాలని కోరారు. వెల్‌లోకి వచ్చి సభాపతిని సవాల్ చేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. సభాపతి ఆత్మగౌరవానికి భంగం కలిగించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. స్పీకర్‌తో పాటు ఆయన తల్లిని అవమానించేలా వ్యాఖ్యలు చేశారని, అందుకే దళిత సంఘాలు నిరసనకు దిగాయని భట్టి పేర్కొన్నారు.

**'దొరతనం పోకడలను భరించం'**

ఎర్రవల్లిలో దళిత సంఘాల నిరసన అనంతరం వారు నడిచిన రోడ్డును పసుపు నీళ్లతో 'శుద్ధి' చేశారన్న ఘటనపైనా భట్టి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది దళితులను అవమానించడమేనని ఆరోపించారు. "న్యాయం కావాల్సింది బలహీనవర్గాలకు.. దళిత, గిరిజనులకు. బీఆర్‌ఎస్ చేతుల్లో అవమానానికి గురవుతున్న పేద ప్రజలకు న్యాయం జరగాలి" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేతల తీరును ప్రభుత్వం ఇప్పటివరకు సంయమనంతో భరిస్తోందని పేర్కొన్నారు. "దొరతనం పోకడలను భరించేందుకు తెలంగాణ సిద్ధంగా లేదు. సభాపతి స్థానాన్ని గౌరవిస్తూ ప్రజా సమస్యలపై చర్చించాలి" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

# కేటీఆర్, హరీశ్‌రావు సహా బీఆర్‌ఎస్ నేతలపై కేసు

**మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో నమోదు**

**విధులకు ఆటంకం.. దుర్భాషలాడారని ఆరోపణ**

**అసెంబ్లీ గేటు వద్ద ఘటనపై పోలీసుల చర్య**

**సీసీటీవీ, వీడియోల పరిశీలనకు విజ్ఞప్తి**

**సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో దర్యాప్తు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు):** అసెంబ్లీ వద్ద మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దుర్భాషలాడి, బెదిరించారన్న ఆరోపణలపై బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో సహా పలువురు ఆ పార్టీ నేతలపై సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అసెంబ్లీ గేట్ నంబర్--3 వద్ద సోమవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ విధులకు ఆటంకం కలిగించారని, దుర్భాషలాడడంతో పాటు బెదిరింపులకు పాల్పడ్డారని మహిళా పోలీసు సిబ్బంది ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. మహిళా పోలీసులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారని, తమ సమక్షంలో కొందరు టీషర్టులు విప్పి నిరసన తెలపడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యామని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, వీడియోలు, ఫొటోలు, వైద్య రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. తోపులాటలో మహిళా పోలీసులను నెట్టారని, అనంతరం కొందరు పోలీసు సిబ్బంది వైద్య చికిత్స పొందారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనతో తమకు మానసిక వేదన, అవమానం కలిగిందని మహిళా పోలీసులు తెలిపినట్లు సమాచారం. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ముద్రించిన నల్ల టీషర్టులతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని గేటు వద్ద అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. తమను సభలోకి ఎందుకు అనుమతించడం లేదని హరీశ్‌రావు పోలీసులను ప్రశ్నించగా, టీషర్టులపై ఉన్న నినాదాలకు అనుమతి లేదని, స్పీకర్ ఆదేశాల మేరకే అడ్డుకుంటున్నామని పోలీసులు చెప్పినట్లు సమాచారం. దీంతో హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నేతలు అక్కడే టీషర్టులు తీసేసి నిరసన కొనసాగించారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్‌ఎస్ నేతలకు మధ్య తోపులాట మరింత పెరిగింది. ఈ ఘటనలో కేటీఆర్, హరీశ్‌రావు, సుధీర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి సహా పలువురిపై కేసు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు. మహిళా పోలీసుల పట్ల అనుచితంగా వ్యవహరించారన్న ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో తాజాగా కేసు నమోదు కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే మహిళా పోలీసుల ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు ప్రస్తుతం ఆరోపణల దశలోనే ఉన్నాయి. ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం దర్యాప్తులో పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# మా ఎమ్మెల్యేలపై దాడి.. మాపైనే కేసులా?

- గవర్నర్‌కు బీఆర్ఎస్ ఫిర్యాదు
- పోలీసుల తీరుపై ఆధారాలు ఇచ్చామన్న కేటీఆర్
- సబిత, సునీత ఘటనలను వివరించిన నేతలు
- హామీల అమల్లో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపణ
- రాష్ట్ర పరిస్థితులపై జోక్యం చేసుకోవాలని వినతి



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు):** అసెంబ్లీ వద్ద తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నేతలు గవర్నర్ శివ్‌ప్రతాప్ శుక్లాకు ఫిర్యాదు చేశారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని, దాడికి సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించినట్లు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. తమపై దాడులు జరిగాయని ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయకుండా.. తిరిగి తమపైనే కేసులు పెట్టారని ఆరోపించారు. లోక్‌భవన్‌లో గవర్నర్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు కలిసి వినతిపత్రం సమర్పించారు. అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలతో పాటు రాష్ట్రంలో శాంతిభద్రతలు, రైతులు, నిరుద్యోగుల సమస్యలు, ఎన్నికల హామీల అమలు తదితర అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనకు నిరసనగా నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించారని, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని ఆరోపిస్తూ అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు చూపించినట్లు చెప్పారు. "శాసనసభ్యులపై నడిరోడ్డుపై పోలీసులు ఎలా దాడి చేశారో గవర్నర్‌కు వివరించాం. మాపై దాడులు చేసి తిరిగి మాపైనే కేసులు పెట్టారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా మా ఫిర్యాదుపై కేసు నమోదు కాలేదు" అని కేటీఆర్ ఆరోపించారు. అయితే మహిళా ఎమ్మెల్యేలపై దాడి, చీర లాగారన్న అంశాలు బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు కాగా, వాటిపై అధికారిక విచారణలో వాస్తవాలు తేలాల్సి ఉంది. పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ నల్ల టీషర్టుతో నిరసన తెలిపినట్లుగానే తాము కూడా కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు నిరసనగా నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్లామని కేటీఆర్ చెప్పారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు తమకూ ఉందన్నారు. ఎన్నికలకు ముందు వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పిందని, కానీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. 420కి పైగా హామీలను అమలు చేయకుండా గాలికొదిలేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు ద్వారా రూ.73 వేల కోట్లు రైతులకు అందించామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను సకాలంలో అందించడంలోనూ విఫలమైందని విమర్శించారు. రైతుబీమాను నీరుగార్చడంతో పాటు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, తమ ఎమ్మెల్యేలపై జరిగినట్లు ఆరోపిస్తున్న పోలీసు దాడులు, రైతులు, నిరుద్యోగుల సమస్యలు, ప్రభుత్వ హామీల అమలుపై గవర్నర్‌కు సమగ్రంగా వివరించామని, ఈ అంశాల్లో జోక్యం చేసుకోవాలని కోరినట్లు కేటీఆర్ తెలిపారు.

# మహిళా ఎమ్మెల్యేలను తోసింది సొంత నేతలే!

- వీడియోలు విడుదల చేసిన మంత్రి సీతక్క
- గంగుల, సుధీర్‌రెడ్డిపై తీవ్ర ఆరోపణలు
- సబిత, సునీత, కోవ లక్ష్మిని నెట్టేశారని వ్యాఖ్య
- పోలీసులపై బీఆర్ఎస్ ఆరోపణలకు కౌంటర్
- వీడియోలు మార్ఫింగ్ అంటూ బీఆర్ఎస్ ఖండన



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు):** అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణల వివాదం మరో మలుపు తిరిగింది. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిని పోలీసులు కాదని.. వారి సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే వెనుక నుంచి నెట్టేశారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించినవిగా పేర్కొంటూ కొన్ని వీడియోలు, ఫొటోలను ఆమె మీడియాకు విడుదల చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, సుధీర్‌రెడ్డి తమ పార్టీ మహిళా సభ్యులను వెనుక నుంచి నెట్టారని సీతక్క ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేలను పక్కకు తోసుకుంటూ ముందుకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. సొంత పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పురుష సభ్యులు ఈ విధంగా వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. గత సోమవారం నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు గేటు వద్ద అడ్డుకున్న సమయంలో తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి తదితర మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై గవర్నర్‌కు సైతం ఫిర్యాదు చేసి, ఆధారాలు సమర్పించినట్లు కేటీఆర్ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే సీతక్క విడుదల చేసిన వీడియోలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. మహిళా ఎమ్మెల్యేలకు జరిగినట్లు చెబుతున్న ఘటనలకు పోలీసులు కారణం కాదని, బీఆర్ఎస్ నేతల తోపులాటలోనే వారు ఇబ్బందులకు గురయ్యారని సీతక్క వాదించారు. మరోవైపు అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనలో గాయపడినట్లు చెబుతున్న మహిళా పోలీసు సిబ్బందిని సీతక్క పరామర్శించారు. విధులకు ఆటంకం కలిగించడం, దుర్భాషలాడటం, బెదిరించడం తదితర ఆరోపణలపై కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. కొంతమంది బీఆర్ఎస్ నేతలు తమ ఎదుట టీషర్టులు విప్పి నిరసనకు దిగారని, తోపులాటలో ఇబ్బందులకు గురిచేశారని మహిళా కానిస్టేబుల్ తన ఫిర్యాదులో ఆరోపించారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం సహించబోదని సీతక్క స్పష్టం చేశారు. అయితే సీతక్క విడుదల చేసిన వీడియోలు, ఫొటోలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటిని మార్ఫింగ్ చేశారని, కృత్రిమ మేధతో రూపొందించిన దృశ్యాలని ఆరోపిస్తూ మంత్రి వాదనను కొట్టిపారేశారు. దీంతో అసెంబ్లీ గేటు వద్ద మహిళా ఎమ్మెల్యేలను ఎవరు నెట్టారన్న అంశంపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పరస్పర విరుద్ధ వాదనలు వినిపిస్తున్నాయి. వీడియోల ప్రామాణికత, ఘటనలో ఎవరి పాత్ర ఏమిటన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

# ఈ-20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదు

- అసెంబ్లీలో మంత్రి పొన్నం స్పష్టీకరణ
- ఇప్పటివరకు ఒక్క ఫిర్యాదూ రాలేదని వెల్లడి
- ప్రత్యేక మార్గదర్శకాల అవసరం లేదన్న ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన తెలంగాణ
- వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో నిజం లేదని వ్యాఖ్య



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు):** ఇథనాల్ కలిపిన ఈ-20 పెట్రోల్ వినియోగంతో వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ ఇంధనం కారణంగా వాహనాలకు నష్టం వాటిల్లినట్లు ఇప్పటివరకు రాష్ట్ర రవాణాశాఖకు ఎలాంటి నిర్దిష్ట ఫిర్యాదులు అందలేదని శాసనసభలో వెల్లడించారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేస్తున్న అభిప్రాయంతో రాష్ట్ర ప్రభుత్వం ఏకీభవిస్తున్నట్లు తెలిపారు. ఈ-20 పెట్రోల్ కారణంగా వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ తమ దృష్టికి సమాచారం రాలేదని మంత్రి చెప్పారు. ప్రస్తుతం తమ వద్ద ఎలాంటి ప్రతికూల నివేదికలు లేనందున ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేయడం లేదా నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన పరిస్థితి లేదని వివరించారు. ఈ-20 ఇంధనం విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే తెలంగాణ ప్రభుత్వం ఏకీభవిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి లోక్‌సభలో ఇచ్చిన సమాధానాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, మూడు కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ మిశ్రమ ఇంధనాన్ని వినియోగిస్తున్నాయని, ఇంజిన్ వైఫల్యాలకు సంబంధించి నిర్దిష్ట ఫిర్యాదులు అందలేదని కేంద్రం పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ-20 ఇంధనంలోని తేమ, క్లోరైడ్ స్థాయిల కారణంగా కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందంటూ భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం గతంలో కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసినట్లు పేర్కొన్నారు. అయితే దీనిపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ అనంతరం ఆ లేఖను ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ-20 పెట్రోల్ వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయని చెప్పేందుకు ప్రస్తుతం తమ వద్ద ఆధారాలు లేదా ఫిర్యాదులు లేవని, అందువల్ల ప్రత్యేక నియంత్రణ చర్యల అవసరం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో స్పష్టం చేశారు.



# బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

## ఇక ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..

## తెలంగాణలో అధికారంలోకి వస్తాం

## కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు):** తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడించారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

# బీఆర్ఎస్ చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు

## లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన పలువురు మంత్రులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు):** లోక్‌భవన్‌లో గవర్నర్ శివ్‌కుమార్ శుక్లాను పలువురు మంత్రులు కలిశారు. బీఆర్ఎస్ నాయకులు చేసిన శుద్ధీకరణపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ తొలిరోజు లోపలికి ప్రవేశించే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యవహరించిన తీరు... స్పీకర్‌ను అవమానపర్చేవిధంగా మాట్లాడిన తీరును మంత్రులు గవర్నర్‌కు వివరించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో ఉపముఖ్యమంత్రి భట్టి, మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ దొర అహంకారంతో వ్యవహరిస్తోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ విమర్శించారు. శాసనసభ స్పీకర్, అతని తల్లిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు దూషించారని... దీన్ని నిరసిస్తూ కేసీఆర్ ఫామ్ హౌజ్ దగ్గర డప్పులతో దళితులు నిరసన తెలిపిన ప్రాంతాన్ని శుద్ధి చేయడం కేసీఆర్ దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. ఈ రెండు ఘటనలపై డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో పలువురు మంత్రులు... గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. దళితులు ప్రజాస్వామ్యంగా నిరసన తెలిపితే కేసీఆర్ అవమానించారు,

# ఆ బూతులు భరించలేకనే కడుపుమండి మాట్లాడా!

## కేసీఆర్‌పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ?" అంటూ మూడు రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

## సంపాదకీయం



# వరుస వివాదాలు

## బీఆర్ఎస్‌కు బలమా? బలహీనతా?

**అరెస్టులు.. సస్పెన్షన్లతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త వేడి**

**‘ప్రభుత్వ నిర్బంధం’గా మలిస్తే గులాబీ పార్టీకి సానుభూతి**

**హద్దు దాటిన వ్యాఖ్యల ముద్ర పడితే రాజకీయంగా ఎదురుదెబ్బ**

తెలంగాణ రాజకీయాల్లో కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలను గమనిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తోంది. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు సభలో వాదోపవాదాల స్థాయిని దాటి అసెంబ్లీ గేట్లు, పోలీస్‌స్టేషన్లు, కోర్టులు, సస్పెన్షన్ల వరకు చేరింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, ఎన్.నవీన్‌కుమార్‌రెడ్డిల సస్పెన్షన్, అరెస్టులు, స్పీకర్‌పై వ్యాఖ్యల వివాదం, మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల ప్రవర్తనకు సంబంధించిన ఆరోపణలు.. అన్నీ కలిపి తెలంగాణ రాజకీయాలను వేడెక్కించాయి. అయితే ఈ పరిణామాలన్నీ బీఆర్ఎస్‌కు రాజకీయంగా లాభమా? నష్టమా? అనే ప్రశ్న ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. దీనికి ఒకే మాటలో సమాధానం చెప్పడం కష్టం. ఎందుకంటే ఇదే ఘటనలు ఒక కోణంలో బీఆర్ఎస్‌కు సానుభూతిని తెచ్చిపెట్టే అవకాశముంటే.. మరో కోణంలో పార్టీపై ప్రతికూల అభిప్రాయాన్ని కూడా పెంచే ప్రమాదం ఉంది. ప్రతిపక్ష రాజకీయాల్లో అరెస్టులు, నిర్బంధాలు కొత్తేమీ కాదు. అధికారంలో ఉన్న పార్టీ తమ గొంతు నొక్కుతోందని ప్రజలను నమ్మించగలిగితే అవే పరిణామాలు ప్రతిపక్షానికి రాజకీయ పెట్టుబడిగా మారిన సందర్భాలు దేశ రాజకీయాల్లో ఉన్నాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ కూడా అదే వాదనను ముందుకు తెస్తోంది. తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే పోలీసులను ఉపయోగించి అణచివేస్తున్నారని ఆరోపిస్తోంది. ఎమ్మెల్సీల అరెస్టులు, అనంతరం కోర్టు రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించడం వంటి పరిణామాలను తన వాదనకు అనుకూలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆ పార్టీ ప్రయత్నించే అవకాశం ఉంది. ముఖ్యంగా అసెంబ్లీ గేటు వద్ద మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు దురుసుగా వ్యవహరించారన్న బీఆర్ఎస్ ఆరోపణలు ప్రజల్లోకి బలంగా వెళ్తే ప్రభుత్వమే రాజకీయంగా సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి రావచ్చు. ఈ ఆరోపణలను ప్రభుత్వం ఖండించినా.. అసలు ఏం జరిగిందన్నది పారదర్శక విచారణతో తేల్చడం అవసరం.

### కానీ.. ‘హద్దు దాటారు’ అనే ముద్ర పడితే?

బీఆర్ఎస్‌కు అసలు ప్రమాదం ఇక్కడే ఉంది. ప్రతిపక్షం ఎంత దూకుడుగా పోరాడినా ప్రజాస్వామ్య వ్యవస్థల్లో కొన్ని హద్దులు ఉంటాయి. సభాధ్యక్షుడిని, ఆయన కుటుంబ సభ్యులను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారనే అభిప్రాయం ప్రజల్లో బలపడితే బీఆర్ఎస్‌కు సానుభూతి కంటే వ్యతిరేకతే ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుంది. తాతా మధు తన వ్యాఖ్యలు స్పీకర్‌ను ఉద్దేశించినవి కావని వివరణ ఇచ్చారు. ఒకవేళ తన వ్యాఖ్యలను స్పీకర్ అలా భావిస్తే వెనక్కి తీసుకుంటానని కూడా పేర్కొన్నారు. అయినప్పటికీ వివాదం అక్కడితో ముగియలేదు. ఇద్దరు ఎమ్మెల్సీల సస్పెన్షన్ వరకు వెళ్లింది. ఇలాంటి సమయంలో బీఆర్ఎస్ తన రాజకీయ పోరాటానికి, వ్యక్తిగత వ్యాఖ్యలకు మధ్య స్పష్టమైన గీత గీయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాన్ని ఎంత తీవ్రంగా విమర్శించినా వ్యక్తిగత దూషణలుగా భావించే మాటలు మొత్తం రాజకీయ అంశాన్నే పక్కదారి పట్టిస్తాయి. అప్పుడు ప్రజలు చర్చించాల్సిన ప్రభుత్వ వైఫల్యాల స్థానంలో ‘ఎవరు ఎవరిని ఏమన్నారు?’ అన్నదే ప్రధాన చర్చగా మారుతుంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలన్న అధికారపక్ష డిమాండ్ కూడా రాజకీయంగా ఆసక్తికరమైనదే. ఇద్దరు ఎమ్మెల్సీల వ్యాఖ్యల బాధ్యతను నేరుగా పార్టీ అధినేతకు ముడిపెట్టడం ద్వారా వివాదాన్ని కేసీఆర్ వరకు తీసుకెళ్లే ప్రయత్నం కనిపిస్తోంది. కాంగ్రెస్‌కు ఇందులో రాజకీయ ప్రయోజనం లేకపోలేదు. బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలను పార్టీ సంస్కృతిగా చిత్రీకరించగలిగితే ప్రతిపక్షంపై నైతిక ఒత్తిడి పెంచవచ్చు. మరోవైపు బీఆర్ఎస్ మాత్రం వ్యక్తుల వ్యాఖ్యల పేరుతో పార్టీ అధినేతను లక్ష్యంగా చేసుకోవడం రాజకీయ కక్షసాధింపేనని ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చు. ఇద్దరు ఎమ్మెల్సీల సభ్యత్వాలనే రద్దు చేయాలన్న డిమాండ్లు అధికారపక్షం నుంచి మరింత తీవ్రమైతే రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది. సభా గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు అవసరమన్న వాదన ఒకవైపు ఉంటుంది. అదే సమయంలో శిక్ష తప్పుకు తగిన స్థాయిలోనే ఉండాలన్న ప్రజాస్వామ్య సూత్రం కూడా ముఖ్యమే.

### కాంగ్రెస్‌కూ సంయమనమే శ్రేయస్కరం

ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ మాత్రమే ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం లేదు. అధికారపక్షానికీ అంతే బాధ్యత ఉంది. ప్రతిపక్ష నేతలు హద్దులు దాటితే చట్టం, సభా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. కానీ ప్రతి రాజకీయ నిరసనకూ పోలీసు చర్యే సమాధానమన్న అభిప్రాయం ఏర్పడితే అది ప్రభుత్వానికే నష్టం చేస్తుంది. ప్రతిపక్షానికి నిరసన తెలిపే ప్రజాస్వామ్య అవకాశం ఉండాలి. అదే సమయంలో సభా గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతిపక్షానికీ ఉంటుంది. ఈ రెండు సూత్రాల్లో ఏ ఒక్కటి దెబ్బతిన్నా ప్రజాస్వామ్యమే బలహీనపడుతుంది.

### మరి.. బీఆర్ఎస్‌కు పాజిటివా? నెగెటివా?

ప్రస్తుతానికి చూస్తే బీఆర్ఎస్‌కు ఇది ‘పూర్తి పాజిటివ్’ కాదు.. ‘పూర్తి నెగెటివ్’ కూడా కాదు. ఈ పరిణామాలను ఆ పార్టీ ఇకపై ఎలా మలుచుకుంటుందన్నదే ఫలితాన్ని నిర్ణయిస్తుంది. అరెస్టులు, సస్పెన్షన్లను మాత్రమే చూపిస్తూ సానుభూతి కోరితే దాని ప్రభావం పరిమితమే కావచ్చు. మహిళా ఎమ్మెల్యేల ఘటనపై వాస్తవాలను ఆధారాలతో ప్రజల ముందుంచి, అదే సమయంలో వ్యక్తిగత దూషణలకు దూరంగా ఉంటూ ప్రభుత్వ హామీలు, రైతులు, నిరుద్యోగులు, మహిళలు, సంక్షేమం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి ప్రజా సమస్యలపై పోరాటాన్ని నిర్మిస్తే ఈ పరిణామాలు బీఆర్ఎస్‌కు రాజకీయంగా ఉపయోగపడే అవకాశం ఉంది. అదే దూకుడు పేరుతో వ్యక్తిగత వ్యాఖ్యలు, సభా మర్యాదలను దాటే ప్రవర్తన కొనసాగితే అధికారపక్షం కోరుకుంటున్నట్లుగానే అసలు సమస్యల నుంచి చర్చ పక్కదారి పడుతుంది. అప్పుడు లాభం కంటే నష్టమే ఎక్కువ కావచ్చు. పోరాటం ఎంత దూకుడుగా సాగిందన్నది కాదు.. దేనికోసం సాగిందన్నదే ప్రజలు చివరకు గుర్తుంచుకుంటారు. అధికారానికి సంయమనం ఎంత అవసరమో.. ప్రతిపక్షానికి బాధ్యత అంతే అవసరం. ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు బీఆర్ఎస్‌కు అవకాశాన్నీ ఇచ్చాయి.. హెచ్చరికనూ చేశాయి. ఆ అవకాశాన్ని ప్రజా ఎజెండాగా మార్చుకుంటుందా? వివాదాల ఊబిలోనే చిక్కుకుంటుందా? అన్నదే గులాబీ పార్టీ ముందున్న అసలు పరీక్ష.

# రైల్వే విస్తరణకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- ఏడు రద్దీ కారిడార్లలో నాలుగు లైన్లు
- 11 వేల కోట్లతో మల్టీట్రాకింగ్ పనులు
- ఐదు రాష్ట్రాల్లోని 14 జిల్లాలకు ప్రయోజనం
- ఏటా 27 మిలియన్ టన్నుల సరకు సామర్థ్యం పెంపు
- తెలుగు రాష్ట్రాలకూ భారీగా లబ్ధి



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (చురకలు):** దేశంలో రైల్వే మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అత్యంత రద్దీగా ఉండే ఏడు ప్రధాన రైల్వే కారిడార్లలో నాలుగు లైన్ల వ్యవస్థను విస్తరించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. సుమారు రూ.11 వేల కోట్ల విలువైన మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కేంద్రం నిర్ణయంతో ఢిల్లీ-హౌరా, హౌరా-ముంబై, ఢిల్లీ-ముంబై, ఢిల్లీ-గువాహటి, ఢిల్లీ-చెన్నై, హౌరా-చెన్నై, ముంబై-చెన్నై కారిడార్లలో రైల్వే నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచనున్నారు. అత్యంత రద్దీగా ఉండే ఈ మార్గాల్లో అదనపు లైన్లు అందుబాటులోకి రావడంతో రైళ్ల రాకపోకల్లో ఆటంకాలు తగ్గడంతో పాటు మరిన్ని ప్రయాణికుల, సరకు రైళ్లను నడిపేందుకు



అవకాశం ఏర్పడనుంది.

### 4,790 గ్రామాలకు ప్రయోజనం

ఈ ప్రాజెక్టులతో ఐదు రాష్ట్రాల్లోని 14 జిల్లాలకు ప్రయోజనం చేకూరనుంది. దాదాపు 4,790 గ్రామాల్లో రైలు కనెక్టివిటీ, రవాణా సామర్థ్యం మెరుగుపడనుండగా సుమారు 56 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం కలుగుతుందని అంచనా. ఢిల్లీ-హౌరా మార్గంలో కాన్పూర్, ప్రయాగ్‌రాజ్, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్, పాట్నా, ఆసన్‌సోల్ వంటి కీలక ప్రాంతాలు ఉన్నాయి. ఢిల్లీ-ముంబై మార్గం మథుర, కోటా, రత్లాం, వడోదర, సూరత్‌లను కలుపుతుంది. ఢిల్లీ-చెన్నై మార్గంలో ఆగ్రా, గ్వాలియర్, ఝాన్సీ, భోపాల్, నాగ్‌పూర్, విజయవాడ వంటి ప్రధాన నగరాలు ఉన్నాయి. ముంబై-చెన్నై కారిడార్ పుణె సహా పలు కీలక ప్రాంతాలను అనుసంధానిస్తోంది.

### సరకు రవాణాకు మరింత ఊపు

ఈ కారిడార్లు బొగ్గు, సిమెంట్, ఇనుము, ఉక్కు తదితర కీలక సరకు రవాణాలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. మల్టీట్రాకింగ్ పనులు పూర్తయితే ఏటా అదనంగా సుమారు 27 మిలియన్ టన్నుల సరకు రవాణా సామర్థ్యం పెరుగుతుందని అంచనా. రద్దీ తగ్గడంతో ప్రయాణికుల రైళ్ల వేగం, సమయపాలన మెరుగుపడేందుకు కూడా అవకాశం ఏర్పడనుంది. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రైల్వేల ఆధునికీకరణ, మౌలిక వసతుల విస్తరణకు నిరంతరం ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. రద్దీ అధికంగా ఉన్న ప్రధాన కారిడార్ల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు భవిష్యత్ రవాణా అవసరాలకు అనుగుణంగా మరిన్ని మార్గాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

### తెలుగు రాష్ట్రాలకు లబ్ధి

కేంద్ర నిర్ణయంతో తెలుగు రాష్ట్రాల్లోనూ రైల్వే మౌలిక వసతుల విస్తరణకు మార్గం సుగమం కానుంది. హౌరా-చెన్నై కారిడార్‌లో భాగంగా విశాఖపట్నం, విజయవాడ మీదుగా నాలుగు లైన్ల విస్తరణ జరగనుంది. ముంబై-చెన్నై కారిడార్‌లో గుంతకల్లు, రేణిగుంట మీదుగా నాలుగు లైన్ల సామర్థ్యం అందుబాటులోకి రానుంది. తెలంగాణలో ఘట్‌కేసర్-కాజీపేట మధ్య సుమారు 110 కిలోమీటర్ల మేర రూ.2,418 కోట్లతో నాలుగో లైన్ నిర్మించనున్నారు. మరోవైపు అరక్కోణం-రేణిగుంట సెక్షన్‌లో మూడు, నాలుగో లైన్ల నిర్మాణానికి కూడా ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. కొత్త లైన్ల నిర్మాణంతో రద్దీ తగ్గడం, రైళ్ల సంఖ్య పెరగడం, సరకు రవాణా సామర్థ్యం మెరుగుపడటంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని కీలక రైల్వే మార్గాలకు మరింత ఊపు లభించనుంది.

# ఉగ్ర కేసు ఎత్తివేయలేదు.. దర్యాప్తు కొనసాగుతోంది

**ఏడుగురు విదేశీయులపై ఎన్ఐఏ స్పష్టత**

**యూఏపీఏ కోణంలో విచారణ**

**ప్రస్తుత ఛార్జ్‌షీట్‌లో విదేశీయుల చట్టం సెక్షన్లే**

**ఆధారాలు లభిస్తే అనుబంధ ఛార్జ్‌షీట్**

**ఉగ్ర ఆరోపణలు తొలగించారన్న ప్రచారానికి తెర**





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (చురకలు):** అమెరికా దేశస్థుడు మాథ్యూ ఆరోన్ వాన్‌డైక్ సహా ఏడుగురు విదేశీయులపై ఉగ్రవాద ఆరోపణలను పూర్తిగా ఉపసంహరించుకోలేదని జాతీయ దర్యాప్తు సంస్థ వర్గాలు స్పష్టం చేశాయి. చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద నమోదైన అంశాలపై దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని పేర్కొన్నాయి. ప్రస్తుత ఛార్జ్‌షీట్‌లో ఆ చట్టంలోని సెక్షన్లు లేకపోవడాన్ని ఉగ్రవాద కోణంలో దర్యాప్తు ముగిసినట్లుగా భావించరాదని తెలిపాయి. భారత్‌లోని సాయుధ గ్రూపులతో సంబంధాలు, ఉగ్ర కుట్రకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో వాన్‌డైక్‌తో పాటు మరో ఆరుగురు విదేశీయులను ఎన్ఐఏ అరెస్టు చేసింది. దర్యాప్తులో ఇప్పటివరకు దేశంలోకి అక్రమంగా ప్రవేశించడం, అనుమతులు లేకుండా నివసించడం, సంచరించడం వంటి నేరాలకు సంబంధించిన ఆధారాలు లభించినట్లు దర్యాప్తు సంస్థ వర్గాలు తెలిపాయి. ఈ కేసులో ఏడుగురు నిందితులపై ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారెనర్స్ చట్టంలోని సెక్షన్లు 21, 23 కింద ఎన్ఐఏ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అయితే అందులో యూఏపీఏ సెక్షన్లను ప్రస్తావించకపోవడంతో నిందితులపై ఉగ్రవాద ఆరోపణలను ఎన్ఐఏ ఎత్తివేసిందన్న ప్రచారం జరిగింది. దీనిపై ఎన్ఐఏ వర్గాలు స్పందిస్తూ.. ఇప్పటివరకు దర్యాప్తులో స్పష్టమైన ఆధారాలు లభించిన నేరాలకు సంబంధించి మాత్రమే ప్రస్తుత ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు తెలిపాయి. ఉగ్రవాద సంబంధాలు, కుట్ర ఆరోపణలపై విచారణ మాత్రం కొనసాగుతోందని స్పష్టం చేశాయి. యూఏపీఏ కింద నేరాన్ని నిర్ధారించే ఆధారాలు తదుపరి దర్యాప్తులో వెలుగులోకి వస్తే అనుబంధ ఛార్జ్‌షీట్ దాఖలు చేసే అవకాశం ఉందని ఎన్ఐఏ వర్గాలు పేర్కొన్నాయి. అందులో సంబంధిత యూఏపీఏ సెక్షన్లను చేర్చే అవకాశం ఉంటుందని తెలిపాయి. ప్రస్తుత ఛార్జ్‌షీట్‌లో యూఏపీఏ సెక్షన్లు లేకపోవడం వల్ల ఉగ్రవాద ఆరోపణలు పూర్తిగా తొలగిపోయినట్లు కాదని, ఆ కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ వర్గాలు స్పష్టం చేశాయి.

# మా ఆదేశాలనే ధిక్కరిస్తారా.. అంత ధైర్యం ఎలా వచ్చింది?

**విద్యార్థికి నోటీసుపై సుప్రీంకోర్టు ఆగ్రహం**

**చర్యలు వద్దని చెప్పినా ఎలా ఇచ్చారని ప్రశ్న**

**మేజిస్ట్రేట్ తీరుపై ధర్మాసనం మండిపాటు**

**జిల్లా అధికారుల నుంచి వివరణ కోరనున్న కోర్టు**

**నోటీసును వెనక్కి తీసుకున్నట్లు వెల్లడి**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9 (చురకలు):** “విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినా ఓ విద్యార్థికి నోటీసు జారీ చేసేంత ధైర్యం మేజిస్ట్రేట్‌కు ఎలా వచ్చింది?” అంటూ సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జులైలో జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనల్లో పాల్గొన్నారన్న ఆరోపణలతో గ్రేటర్ నోయిడాకు చెందిన ఓ విద్యార్థికి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నోటీసు జారీ చేయడాన్ని తప్పుబట్టింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వ్యవహారంపై స్పందిస్తూ.. తమ స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ విద్యార్థిపై చర్యలకు ఎలా ఉపక్రమించారని ప్రశ్నించింది. గౌతమ్‌బుద్ధ నగర్ జిల్లా మేజిస్ట్రేట్, సంబంధిత ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ నుంచి వివరణ కోరనున్నట్లు తెలిపింది. జులైలో జరిగిన సీజేపీ ఆందోళనలకు సంబంధించి విద్యార్థులపై నమోదైన కేసులన్నింటినీ కొట్టివేయాలని సుప్రీంకోర్టు ఈ నెల 1న ఆదేశించినట్లు సమాచారం. జులై 20 నుంచి 25 మధ్య దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొనసాగించరాదని, వాటిని ముగిసిన కేసులుగా పరిగణించాలని స్పష్టం చేసింది. అదే ఆందోళనలకు సంబంధించి భవిష్యత్తులోనూ విద్యార్థులపై కొత్తగా బలవంతపు చర్యలు తీసుకోవద్దని పేర్కొంది. ఈ నేపథ్యంలోనే గ్రేటర్ నోయిడాకు చెందిన విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు జారీ చేసిన విషయాన్ని సీనియర్ న్యాయవాది బిశ్వజిత్ భట్టాచార్య సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ధర్మాసనం జోక్యం చేసుకోవాలని కోరారు. దీనిపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. “ఓ విద్యార్థికి మేజిస్ట్రేట్ నోటీసు ఎలా జారీ చేస్తారు? విద్యార్థులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని మా ఆదేశాలు స్పష్టంగా ఉన్నాయి. అయినా ఇలా చేయడానికి మేజిస్ట్రేట్‌కు ఎంత ధైర్యం?” అంటూ ప్రశ్నించింది. గౌతమ్‌బుద్ధ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థికి ఈ నెల 4న నోటీసు జారీ చేసినట్లు కోర్టు దృష్టికి వచ్చింది. ప్రభుత్వ వ్యతిరేక సమాచారాన్ని ప్రచారం చేయడంతో పాటు జంతర్‌మంతర్ వద్ద జరిగిన సీజేపీ ఆందోళనలో పాల్గొనేలా ఇతర విద్యార్థులను ప్రోత్సహించారన్న ఆరోపణలను అందులో పేర్కొన్నట్లు సమాచారం. అయితే నోటీసు జారీ చేసిన మరుసటి రోజే దానిని ఉపసంహరించుకున్నట్లు కోర్టుకు తెలియజేశారు. అయినప్పటికీ తమ ఆదేశాలకు విరుద్ధంగా అసలు నోటీసు ఎందుకు జారీ చేయాల్సి వచ్చిందనే అంశంపై సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది.



# భారతరత్నకు ‘సర్’ కష్టాలు

## ఒక్క అక్షరం తేడాతో చిక్కులు!

**పాత, కొత్త ఓటరు జాబితాల్లో పేరు సరిపోలలేదని సమాచారం**

**ఈసీ నోటీసులు పంపినట్లు ప్రచారం**

**తమకు నోటీసులేవీ అందలేదన్న రావు ప్రతినిధి**

**గతంలో పద్మశ్రీ హరేకల హాజబ్బకూ ఇదే సమస్య**

**బెంగళూరు, సెప్టెంబర్ 9 (చురకలు):** బెంగళూరుకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న గ్రహీత ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావుకు ‘సర్’ ప్రక్రియలో భాగంగా ఎన్నికల సంఘం(ఈసీ) నోటీసులు పంపించిందని సమాచారం. పాత ఓటరు లిస్టులో ఆయన పేరు.. ఒక అక్షరం కారణంగా ప్రస్తుతం రికార్డుల్లో ఉన్న పేరుతో మిస్‌మ్యాచ్ అయిందని వార్తలు వస్తున్నాయి. పాత రికార్డుల్లో ‘ఫ్రాతీశీట జచీ= ఝశీ’ అని ఉంటే, కొత్త రికార్డుల్లో ఫ్రాతీశీటట జచీ= ఝశీ’ అని ఉంది. ఇందులో ఒక్క ‘ఎఫ్’ అక్షరం అదనంగా ఉండటం వల్ల ఈసీ నోటీసులు పంపించిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అయితే ప్రొఫెసర్ సీఎన్ఆర్ ప్రతినిధి మాత్రం తమకు ఇప్పటిదాకా ఎలాంటి నోటీసులు అందలేదని మీడియాకు తెలిపారు. అలాగే ఒక్క అక్షరం అదనంగా ఉందని.. అది తప్ప మరే ఇతర సమస్యా లేదని ఆయన వివరించారు. ఒక్క సీఎన్ఆర్‌కే కాకుండా చాలా మంది ప్రముఖులకు సర్ నోటీసులు అందుతున్నాయి. మంగళూరుకు చెందిన పద్మశ్రీ గ్రహీత హరేకల హాజబ్బకు పేరులో వ్యత్యాసం కారణంగా ‘సర్’ నోటీసులు అందాయి. కర్ణాటక చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించారు. కాగా, కర్ణాటకలో జన్మించిన ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావు స్ట్రక్చరల్ కెమిస్ట్రీలో విశేష కృషి చేసి 2014లో భారత అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న పొందారు. అలాగే ఆయన పద్మశ్రీ, పద్మవిభూషణ్, కర్ణాటక రత్న పురస్కారాలూ అందుకున్నారు.

# సిద్దిపేటలో రేపటి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 09,:**
సిద్దిపేట పట్టణంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 10వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు సంబంధిత రేషన్ దుకాణాల వద్ద వార్డు అధికారులు, క్షేత్ర సహాయకుల ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులు నిర్ణీత సమయంలో తమకు సంబంధించిన రేషన్ దుకాణానికి చేరుకుని స్మార్ట్ రేషన్ కార్డులను స్వీకరించాలని మున్సిపల్ అధికారులు సూచించారు.

# కాళోజికి ఘన నివాళులు



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 09,:**
తెలంగాణ భాషా దినోత్సవం, ప్రజాకవి కాళోజి నారాయణరావు జయంతి సందర్భంగా బుధవారం సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీకాంత్, జూనియర్ అకౌంటెంట్ ఆఫీసర్ వెంకట్ రావు కాళోజి సేవలను స్మరించుకున్నారు. తెలంగాణ భాష, సాహిత్యం, సామాజిక చైతన్యం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గీతంలో ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి

## తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహణ



**పటాన్చెరు, సెప్టెంబర్ 09,:**
తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా కవి కాళోజీ నారాయణరావు 112వ జయంతి వేడుకలను గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో బుధవారం ఘనంగా నిర్వహించింది. కాళోజీ నారాయణరావు జయంతిని తెలంగాణ ప్రభుత్వం 'తెలంగాణ భాషా దినోత్సవం'గా ప్రకటించిన నేపథ్యంలో విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డిఎస్ రావు కాళోజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆతిథ్య విభాగం–క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని కాళోజీ నారాయణరావుకు నివాళులర్పించారు.

# శ్రీ లోకమాత ఆలయంలో అడువాల జ్యోతి లక్ష్మణ్ ప్రత్యేక పూజలు



**జగిత్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 09, :**
జగిత్యాల పట్టణంలోని 50వ వార్డులో గల శ్రీ లోకమాత ఆలయాన్ని బుధవారం జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలో పాల్గొన్నారు. అడువాల జ్యోతి లక్ష్మణ్ అమ్మవారిని దర్శించుకుని జగిత్యాల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం, ఐశ్వర్యం వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, భక్తులతో అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మూలస్తాం లావణ్య మహేష్, మాజీ కౌన్సిలర్ మూలస్తాం లలిత, మాజీ కౌన్సిలర్ మూలస్తాం రాజేందర్, చారి, ఆలయ నిర్వాహకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రీజినల్ రింగ్ రోడ్డు భూ సేకరణను వేగవంతం చేయాలి

- **జాతీయ రహదారుల అధికారులకు భూమిని త్వరితగతిన అప్పగించాలి**
- **ప్రత్యేక కార్యదర్శి గంగాధర్**



**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 09,:**
రీజినల్ రింగ్ రోడ్డు భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, నేషనల్ హైవే అధికారులకు భూమిని అప్పగించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి కె గంగాధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం గజ్వేల్ పట్టణంలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో జిల్లా కలెక్టర్ కట్టా హైమావతితో కలిసి రీజనల్ రింగ్ రోడ్డు భూ సేకరణపై రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీజనల్ రింగ్ రోడ్డు సిద్దిపేట జిల్లాలో రాయపోల్, వర్గల్, మర్కుక్, గజ్వేల్, జగదేవ్‌పూర్ మండలాల మీదుగా వెళ్తుందని తెలిపారు. ప్రాజెక్టు ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని భూ సేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. భూ సేకరణకు సంబంధించిన మధ్యవర్తిత్వ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో ఆయా ప్రాంతాల్లో కలిగే అభివృద్ధి, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆర్డీఓ ఆధ్వర్యంలో తహసీల్దార్లు, సర్వే అధికారులు, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. భూ సేకరణ పూర్తయిన ప్రాంతాల్లో డ్రోన్ సర్వే నిర్వహించి, రైతులు కొత్తగా పంటలు సాగు చేయకుండా అవసరమైన చర్యలు తీసుకుని భూమిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. భూ సేకరణ పూర్తయిన భూమిని నిబంధనల ప్రకారం జాతీయ రహదారుల అధికారులకు అప్పగించాలని, అప్పగించిన భూమి సంరక్షణ బాధ్యత పూర్తిగా జాతీయ రహదారుల సంస్థదేనని స్పష్టం చేశారు. భూమి అప్పగింత అనంతరం కూడా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. రెవెన్యూ, జాతీయ రహదారుల శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి రీజనల్ రింగ్ రోడ్డు భూ సేకరణ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని ప్రత్యేక కార్యదర్శి కె గంగాధర్ ఆదేశించారు. ఈ సమీక్షలో ఆర్డీఓ చంద్రకళ, జాతీయ రహదారుల శాఖ అధికారులు, ఆయా మండలాల తహసీల్దార్లు, సర్వే అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి సప్తభజన

**టేక్మాల్, సెప్టెంబర్ 09,:**
టేక్మాల్ మండల కేంద్రంలో లోక కల్యాణాన్ని ఆకాంక్షిస్తూ బుధవారం నిర్వహించిన సప్తభజన కార్యక్రమం భక్తుల వేదమంత్రోచ్ఛారణలు, భక్తికీర్తనల నడుమ అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ప్రపంచశాంతి, సమస్త జీవకోటి శ్రేయస్సును కాంక్షిస్తూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ వేడుకలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, అన్నపూర్ణాదేవికి విశేష అలంకరణలు చేశారు. భక్త బృందాలు ఆలయ ప్రాంగణంలో అహోరాత్రులు చేసే నామసంకీర్తనలు, భజనలతో క్షేత్రం భక్తిపారవశ్యంలో మునిగి తేలుతోంది.

**సాటిలేని దానం నిత్య అన్నదానం**

సప్తభజన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. అన్నదానం పరమో ధర్మ అనే సూక్తికి అనుగుణంగా ఆలయానికి వచ్చే భక్తులందరికీ అన్నపూర్ణాదేవి ప్రసాదంగా అన్నప్రసాద వితరణ జరుగుతోంది. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ "లోక కళ్యాణం, మానవాళి క్షేమమే లక్ష్యంగా ఈ సప్తభజన సంకీర్తనలను నిర్వహిస్తున్నాం. అన్నపూర్ణమ్మ నివాసమైన ఈ క్షేత్రంలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదనే సంకల్పంతో నిత్య అన్నదానం చేపడుతున్నాం. భక్తులందరూ ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని, అన్నప్రసాదాన్ని స్వీకరించి



అమ్మవారి, స్వామివారి కృపకు పాత్రులుకావాలి" అని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ గ్రామ పెద్దలు కోరారు.

# వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

- **వార్షికోత్సవంలో పాల్గొన్న పులిమామిడి రాజు**



**సదాశివపేట, సెప్టెంబర్ 09,:**
స్థానిక విశ్వేశ్వర శివాలయ 16వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వేద పండితులు జంగం మహేష్ స్వామి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే కాంటెస్టెడ్ అభ్యర్థి పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై శ్రీ పార్వతీ పరమేశ్వరులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుల ఆశీర్వాదాలు తీసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శివపార్వతుల కల్యాణోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ శివపార్వతుల అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ లక్ష్మిప్రియా భరత్ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీరంగూడ గుట్ట ఆలయంలో రూ.13.69 లక్షల హుండీ ఆదాయం

## పూర్తైనా 200 రోజుల హుండీ లెక్కింపు

**పటాన్చెరు, సెప్టెంబర్ 09,:**
సంగారెడ్డి జిల్లా బీరంగూడ గుట్టపై కొలువైన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో బుధవారం 200 రోజుల హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీ ద్వారా మొత్తం రూ.13,69,009 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సంగారెడ్డి దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు సమక్షంలో హుండీ లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. ఆలయ ఈవో దేవనాదం, చైర్మన్ సుధాకర్ యాదవ్ పర్యవేక్షణలో భక్తుల సహకారంతో లెక్కింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో దేవనాదం మాట్లాడుతూ హుండీ ద్వారా సమకూరిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని తెలిపారు. త్వరలోనే ఆలయ ప్రాంగణంలో వేద పాఠశాల, హోమశాల, గోశాల, అన్నదాన సత్రం, సులభ కాంప్లెక్స్‌తో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. ఆలయ అభివృద్ధికి భక్తుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. చైర్మన్ సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ 200 రోజుల హుండీ లెక్కింపులో రూ.13,69,009 ఆదాయం సమకూరిందని తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియకు సహకరించిన భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హుండీ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకే వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఆలయ కార్యక్రమాలకు సహకరిస్తున్న



ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిటీ సభ్యులు, అధికారులు, మహిళా భక్తులు, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# "పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది"

- **ప్రజల్లో చైతన్యాన్ని నింపిన మహనీయులు కాళోజి**
- **జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**
- **కలెక్టరేట్‌లో ఘనంగా కాళోజి నారాయణరావు జయంతి వేడుకలు**



**జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 09, :**
ప్రజాకవి, తెలంగాణ వైతాళికుడు కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ హాజరై కాళోజి నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాళోజి నారాయణరావు తన రచనల ద్వారా సామాన్య ప్రజల సమస్యలను, సామాజిక రుగ్మతలను, అన్యాయాలను ఎత్తిచూపుతూ ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి తన కలం, గళం ద్వారా సామాజిక మార్పు కోసం కాళోజి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. కాళోజి ఆశయాలను, ఆయన చూపిన ప్రజాస్వామ్య స్ఫూర్తిని నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ అన్నారు. తెలంగాణ భాష, సాహిత్యం, సంస్కృతి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లత, రాజ గౌడ్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొని కాళోజి నారాయణరావు చిత్రపటానికి పుష్పాలతో ఘనంగా నివాళులర్పించారు.

# జలసిరి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

- ప్రతి ఇంటికి ఇంకుడు గుంత.. ప్రతి పొలానికి పంటకుంట..
- ప్రభుత్వ భవనాల్లో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటు చేయాలి
- సిద్దిపేట జిల్లా కట్టా కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 09,:**
వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నిర్మిస్తున్న రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణం పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని, నిర్మాణ నాణ్యతను అధికారులను అడిగి తెలుసు కున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి గ్రామానికి నీటి సంరక్షణ నిర్మాణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షపు నీరు వృథాగా వెళ్లకుండా అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకుని భూగర్భ జలాలను పెంపొందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. మొదటగా గ్రామాలు, మండలాల్లోని అన్ని ప్రభుత్వ భవనాల్లో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ భవనాల్లో ఏర్పాటు చేసే ఈ నిర్మాణాలు ప్రజలకు ఆదర్శంగా నిలిచి, తమ ఇళ్లలోనూ వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకునేలా ప్రేరణ కల్పిస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను భాగస్వాములను చేస్తూ నీటి సంరక్షణపై విస్తృతంగా అవగాహన కల్పించాలని,



చేపట్టిన నిర్మా ణాలను నాణ్యతా ప్రమాణాలతో త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారు లను ఆదేశించారు. వర్షపు నీటిని సంరక్షిం చడమే భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించే మార్గమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేసి, సిద్దిపేట జిల్లాను నీటి సంరక్షణలో ఆదర్శ జిల్లాగా నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ డీఆర్‌డీఓ రమేష్, కొండపాక ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, దుద్దెడ సర్పంచ్ శివకుమార్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే పనులను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లత
- నాన్ కెడస్ట్రాల్ రిసర్వే, ఎంజాయ్మెంట్ రీ సర్వే పనుల పరిశీలన



**జగిత్యాల/పెగడపల్లి సెప్టెంబర్ 09, :**
పెగడపల్లి మండలంలోని ల్యాగల మర్రి గ్రామంలో బుధవారం నాన్ కెడస్ట్రాల్ రీసర్వే, ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా రీ సర్వే ప్రక్రియను నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మొదట గ్రామ బౌండరీ పై లైసెన్స్డ్ సర్వేయర్లు, మండల సర్వేలు కలిసి రీ సర్వే చేస్తారని. తర్వాత ఒక్కొక్క రైతు వారిగా రీ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. రైతులు, గ్రామస్థుల అడిగిన సందేహాలకు తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, మండల సర్వేయర్ , రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# దళితులను అవమానించే పనులు ఎవ్వరు చేసిన ఉపేక్షించేది లేదు

- దళితులను అవమానించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం
- ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

**హైదరాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 09,:**
దళితులను అవమానించే పనులు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని, దళితులను అవమానించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుద్ధికరణ పేరుతో దళితులను అవమానించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం వెయ్యి డప్పులతో కేసీఆర్ ఫామ్ హౌస్ కు చేరుకున్న దళితులు అక్కడ చావు డప్పు కొట్టి నిరసన వ్యక్తం చేశారు. దళితులు అడుగు పెడితే ఈ నేల మలినమైందని బుధవారం బిఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. ఈ చర్యలకు పాల్పడినవారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ స్టేట్ వైస్ చైర్మన్ కొమ్ము విజయ్ కుమార్, సిద్దిపేట జిల్లా చైర్మన్ తప్పేట శంకర్, నంగునూరు మండలం చైర్మన్ రావుల కృష్ణలు టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గాడిపల్లి రఘు వర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర అసెంబ్లీలోని ఛాంబర్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను, మంత్రి వివేక్ వెంకటస్వామిని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి కేసీఆర్ ఫామ్ హౌస్ వద్ద జరిగిన సంఘటనపై పూర్తి వివరాలను వెల్లడించారు. దళితులు అడుగుపెట్టిన నేలపై పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేసిన బిఆర్ఎస్ నేతలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని, వారిని జైలుకు పంపితేనే మరోసారి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉంటాయని వారు మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. దళితులను ఆత్మగౌరవంతో నిలబెట్టింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి బట్టి మాట్లాడుతూ దళితులను అవమానించే పనులు



ఎవరు చేసినా ఉపేక్షించమని, దళితుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, మాట్లాడినా అలాంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడుస్తున్నప్పటికీ దళితులను చిన్న చూపు చూడడం సిగ్గుచేటని టీపీసీసీ స్టేట్ చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు.

# కాళోజీ స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

**సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్ 09,:**
ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ హాజరై కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ మాండలికంలో సామాజిక అంశాలపై రచనలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించిన గొప్ప ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని కొనియాడారు. ఆయన సాహిత్య, సామాజిక సేవలను గుర్తించిన ప్రభుత్వం పద్మవిభూషణ్ పురస్కారంతో గౌరవించిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కాళోజీ నారాయణరావు జన్మదినాన్ని తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించి ప్రతి సంవత్సరం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహిస్తోందన్నారు. కాళోజీ ఆశయాలు, సాహిత్యం, ప్రజా చైతన్య స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ సుదర్శన్ రెడ్డి, డీబీసీడీఓ హమీద్, డీసీఎస్ఓ తనూజ, ఐఅండ్‌పీఆర్ డీవైఈఓ భూపాల్ రెడ్డి, కలెక్టరేట్ ఏఓ రాజ్‌కుమార్, డీటీఓ, డీఎస్‌సీడీవో తదితరులు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**కొమురంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 09,:**
కొండపల్లి గ్రామానికి చెందిన గుర్లే నీలిమ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా మంజూరైన రూ.48 వేల ఆర్థిక సహాయ చెక్కును బుధవారం అందజేశారు. ఆర్టీఏ మెంబర్ లావాడ్యా రమేష్, మాజీ ఎంపీటీసీ రఘుపతి, రెబ్బెన టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వనమాల మురళి, సీనియర్ నాయకులు పల్లె రాజేశ్వరరావు, యువ నాయకులు సోనాలే సంతోష్ తదితరులు చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా లావాడ్యా రమేష్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. చెక్కు అందుకున్న కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి, మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో పాటు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# కెరీర్‌పై స్పష్టమైన ప్రణాళిక అవసరం



**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 09,:**
స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో కెరీర్ రెడీనెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి జీవన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లాంచ్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థ జిల్లా కన్వీనర్ దివ్య విద్యార్థులకు కెరీర్‌ను సరైన దిశలో మలుచుకునేందుకు అవసరమైన మెలకువలను వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే క్రమబద్ధమైన ప్రణాళికతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్తుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్వేత, మహిళా సాధికారత విభాగం బాధ్యులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ సువర్ణ దేవి, కిషోర్, స్వప్న, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

**సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 09,:**
చిన్నచిన్న రాజీ పడదగిన కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని సిద్దిపేట పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీ పడదగిన నేర కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబపరమైన వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, మద్యం సేవించి వాహనం నడపడం, పట్టణ ఇబ్బందులకు సంబంధించిన కేసులు, చెక్ బౌన్స్ కేసులు, ఇతర రాజీ పడదగిన కేసుల్లోని నిందితులు, ఫిర్యాదుదారులు సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా న్యాయస్థానాన్ని నేరుగా సంప్రదించి రాజీ చేసుకోవచ్చని తెలిపారు. చిన్నచిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరగకుండా, న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందుతుందని పేర్కొన్నారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తూ రాజీ చేసుకునేలా పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నారని కమిషనర్ తెలిపారు.



# సులోచన మృతికి కూన శ్రీశైలం గౌడ్ సంతాపం

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 09,:**



కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి మాతృమూర్తి సులోచన బుధవారం ఉదయం కన్నుమూశారు. విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ బాచుపల్లిలోని వారి నివాసానికి చేరుకుని సులోచన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కోలన్ హనుమంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. సులోచన మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. సులోచన ఆత్మకు శాంతి చేకూరాలని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ప్రైవేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్ 09,:**
నడిపించి కార్పొరేట్ విద్యను విద్యార్థులకు అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందని, అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫాంలో అందించడం జరిగిందని 18 వ వార్డు కౌన్సిలర్ శ్రీరాం సరస్వతి నరేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల భరత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



చురకలు

గురువారం 10.09.2026

# గురువుల సేవకు మన సత్కారం

- **నార్త్ సిటీ హైస్కూల్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 09,:** సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానించడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నామని పాఠశాల కరెస్పాండెంట్ కోలా వెంకటేష్ ముదిరాజ్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకారిణి భారతీయం సత్యవాణి, కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారిణి జెమిని కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు జీతయ్య, జోషి ప్రవీణ్ కుమార్, సంధ్య, డి. చంద్రశేఖర్, కరుణ, భారతి, పి. అరుణ, సురేష్ బాబు, వెంకటలక్ష్మి , సుకృతిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ ఈశ్వరయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఫౌండర్ కోలా రవీందర్, డైరెక్టర్ శ్రీకాంత్, అకడమిక్ డైరెక్టర్ యోగేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.




# దొర అహంకారాన్ని ఒంట పట్టించుకున్న బిఆర్ఎస్ నేతలు

- **దళితులు నడిచారని రోడ్లను పసుపు నీళ్లతో కడగడం సిగ్గుచేటు**
- **ఎర్రవల్లి సమీప గ్రామాల్లో కొనసాగుతున్న అస్పృశ్యత, కుల వివక్షత**
- **అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి తెరపైకి చేస్తున్న కేసీఆర్ దొర పెత్తందారి వ్యవస్థ**
- **గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్**



**గజ్వేల్ ప్రతినిధి, సెప్టెంబర్ 09,:** మర్కుక్ మండలం ఎర్రవల్లి సమీప గ్రామాలలో దళితులు డప్పు చప్పులతో నడిచారని బిఆర్ఎస్ నేతలు పసుపు నీళ్లతో రోడ్లు శుభ్రం చేయడం సిగ్గుచేటని, కేసీఆర్ దొర అహంకారాన్ని ఒంట బట్టించుకున్న ఆ పార్టీ నేతల వైఖరి ఈ సంఘటనతో బహిర్గతం అయ్యిందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ విమర్శించారు. బుధవారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సర్దార్ ఖాన్ మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అసెంబ్లీ సాక్షిగా దూర్భాషలాడారని, అదే దారిలో వెళ్తున్న ఆ పార్టీ నేతలు అంటరానితనం, అస్పృశ్యత, కుల వివక్షత చూపిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని బిఆర్ఎస్ నేతలు విస్మరించి కేసీఆర్ ఫ్యూడలిజాన్ని తెరపైకి తెస్తున్నారని, ఈ చర్య సమాజ శ్రేయస్సుకు ఎంత మాత్రం శ్రేయస్కరం కాదని నిలదీశారు. యుగాలు, తరాలు మారినా గ్రామాల్లో కుల వివక్షత కొనసాగడం దురదృష్టకరమని, సామాజిక ప్రజాస్వామ్యంతోనే దళితులకు నిజమైన స్వాతంత్ర్యం వస్తుందని అన్నారు. దళిత సమాజాన్ని కించపరిచే విధంగా వ్యవహరించిన బిఆర్ఎస్ నేతలను పార్టీ నుండి బహిష్కరించాలని, లేనిపక్షంలో కేసీఆర్ దళిత వ్యతిరేక వ్యక్తిగా చరిత్రలో నిలుస్తారని చెప్పారు. రోడ్లపై దళితులు నడిచారని పసుపు నీళ్లు చల్లి శుభ్రం చేసిన ఆ దుశ్చర్యకు పాల్పడిన నేతలు క్షమాపణ చెప్పని పక్షంలో నియోజకవర్గంలోని దళిత సమాజాన్ని చైతన్యం చేసి తగిన గుణపాఠం చెప్తామని సర్దార్ ఖాన్ హెచ్చరించారు.

# ప్రాచీన తాళపత్రాలు, పాండులిపులు అందజేయాలి

- **జ్ఞాన భారత్‌మ్ మిషన్‌లో భాగంగా సేకరణ, డిజిటలైజేషన్**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 09,:** భారతదేశంలోని ప్రాచీన, అరుదైన తాళపత్రాలు, చేతిరాత ప్రతులు, పాండులిపులు, ఇతర సాంప్రదాయ జ్ఞాన వనరులను సంరక్షించి, డిజిటలైజ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జ్ఞాన భారతం మిషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రజల వద్ద ఉన్న ఇటువంటి అమూల్యమైన జ్ఞాన సంపదను సేకరిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరి వద్దనైనా ప్రాచీన తాళపత్రాలు, చేతిరాత ప్రతులు, పాండులిపులు లేదా ఇతర అరుదైన సంప్రదాయ జ్ఞాన వనరులు ఉంటే వాటిని కలెక్టర్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కార్యాలయంలో అందజేయాలని ఆమె కోరారు. సేకరించిన ప్రతులను డిజిటలైజ్ చేసిన అనంతరం తిరిగి అందజేస్తామని తెలిపారు. భారతదేశంలో వేల సంవత్సరాలుగా వివిధ భాషలు, లిపులు, ప్రాంతాల్లో భద్రపరచబడిన ప్రాచీన గ్రంథాల్లో చరిత్ర, సాహిత్యం, వైద్యం, విజ్ఞానం, ఖగోళశాస్త్రం, తత్వశాస్త్రం, కళలు, సంస్కృతి, సంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన అమూల్యమైన సమాచారం ఉందని పేర్కొన్నారు. ఈ మిషన్‌లో భాగంగా మాన్యుస్క్రిప్టుల గుర్తింపు, జాబితా తయారీ, శాస్త్రీయ సంరక్షణ, డిజిటలైజేషన్, వివరాల నమోదు, డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకురావడం వంటి కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. తద్వారా దేశ ప్రాచీన జ్ఞాన సంపదను భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించడంతోపాటు పరిశోధకులు, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని వివరించారు. జిల్లాలోని ప్రజలు తమ వద్ద ఉన్న ఇటువంటి అరుదైన జ్ఞాన సంపదను సంరక్షణ, డిజిటలైజేషన్ కోసం అందజేసి జ్ఞాన భారతం మిషన్‌కు సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు.



# దళితుల ఆగ్రహానికి బీఆర్ఎస్ బొందపెట్టే రోజులు దగ్గర్లోనే



- **కేసీఆర్‌పై డాక్టర్ భూదాల అమర్ బాబు తీవ్ర విమర్శలు**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 09,:** తెలంగాణలో దళితులను మోసం చేసిన కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై దళితులు తిరుగుబాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందని నేషనల్ దళిత సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు డాక్టర్ భూదాల అమర్ బాబు అన్నారు. గాంధీనగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని, మూడెకరాల భూమి, దళిత బంధు ఇస్తామని హామీలు ఇచ్చి కేసీఆర్ దళితులను మోసం చేశారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ నేతలు అసభ్య వ్యాఖ్యలు చేయడం, విధి నిర్వహణలో ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దళితులపై అన్యాయం జరిగితే బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కోరుతామని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ కోఆర్డినేటర్ బాబురావు తెలిపారు. చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు దళితుల పోరాటం కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివకుమార్, నేషనల్ దళిత సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షులు బి. ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- **మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు**
- **అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపీ రఘునందన్ రావు**
- **కాసులాబాద్ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ వెల్లడి**





**మిరుదొడ్డి, సెప్టెంబర్ 09,:** పార్టీలకతీతంగా గ్రామ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలో బుధవారం ఓపెన్ జిమ్ ను ఆయన ప్రారంభించారు. అనంతరం కుల సంఘాల భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో గ్రామ రోడ్ల కోసం నిధులు మంజూరు చేయించానని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడిచినా నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిపారు. గ్రామంలో పెద్ద పెద్ద కాంట్రాక్టర్లు ఉన్నా, కనీసం గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. గ్రామానికి సంబంధించిన ప్రధాన రోడ్లను సొంత ఖర్చులతోనైనా వేసి గ్రామంపై మక్కువ చూపాలని ఆ కాంట్రాక్టర్లకు, నాయకులకు సూచించారు. గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్, గోదాం, హైమాక్స్ లైట్లు కావాలని ఉప సర్పంచ్ రాజు ఎంపీని కోరారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేసి నిధులు మంజూరు చేస్తానని ఎంపీ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే గ్రామం అభివృద్ధిలో వెనుకబడిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, బీజేపీ సీనియర్ నాయకులు గౌరీశం, రాజు, నరేష్, భాను తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ సంబరాలు

**దుబ్బాక ప్రతినిధి, సెప్టెంబర్, 09,:** కాళోజి నారాయణ రావు 112వ జయంతి సందర్భంగా తెలంగాణ ఆదర్శ పాఠశాల లచ్చపేటలో మంగళవారం తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే ప్రారంభమైన కార్యక్రమాలలో భాగంగా తెలుగు కవులు రచయితల చిత్రపటాల ప్రదర్శన, గ్రంథాలయంలోని 400 తెలుగు పుస్తకాల ప్రదర్శన అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.12 అంశాలలో విద్యార్థులకు భాషా సంబంధమైన పోటీలు నిర్వహించారు. 42 మంది విద్యార్థులు తెలంగాణ కవులు, రచయితలు, ఉద్యమ వీరులు, ప్రముఖులు, తెలంగాణ కళలు, సంస్కృతి, భాష, ఉద్యమం మొదలైన అంశాలపై చక్కగా ప్రసంగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి ప్రభుదాస్ గారు తెలుగు భాష ఔన్నత్యాన్ని విద్యార్థులకు తెలియజేసి, ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం ఇంత గొప్పగా జరగడాన్ని అభినందించారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రిన్సిపల్ బుచ్చిబాబు తెలుగు ఉపాధ్యాయులు నరేష్ భవాని రమేష్ తో కలిసి గత సంవత్సరం ఇంటర్లో మొదటి సంవత్సరంలో తెలుగులో 99 మార్కులు సాధించిన 16 మంది విద్యార్థులకు అలాగే పదవ తరగతి తెలుగులో వందకు వంద మార్కులు సాధించిన విద్యార్థినికి బహుమతులు ప్రధానం చేశారు. వివిధ కార్యక్రమాలలో పాల్గొని అలరించిన విద్యార్థులకు ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు బహుమతులు అందించారు.



# ప్రజాస్వామ్యబద్ధంగా శాసనసభ నడపాలి

- **బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ ఎత్తివేయాలి**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 09,:** తెలంగాణ సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన కేసీఆర్ ఇంటికి కాంగ్రెస్ నాయకులు చావు డప్పులతో వెళ్లడం దారుణమని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు సోమిరెడ్డి, కనకయ్య, జువ్వన్న కనకరాజు, సాయిప్రేమ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలను చర్చించే శాసనసభ నుంచి ప్రధాన ప్రతిపక్ష ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడం పిరికిపంద చర్య అన్నారు. ప్రతిపక్షాన్ని సభ నుంచి బయటకు పంపి చర్చలు ఎవరితో జరుపుతారని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఆరు గ్యారంటీలపై ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని ఆరోపించారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఉద్రిక్తతలో ఆవేశంగా అన్న మాటలను పట్టుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేలను సభకు రాకుండా అడ్డుకోవడం, సస్పెండ్ చేయడం ప్రజాస్వామ్యాన్ని గొంతునొక్కడమే నన్నారు. కేసీఆర్ దళితుల కోసం అనేక పథకాలు అమలు చేశారని రాజనర్సు గుర్తుచేశారు. 1995లోనే దళిత చైతన్య జ్యోతి పథకాన్ని అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కేసీఆర్ ఆలోచనలతోనే దళిత బంధు పథకం పుట్టిందని, ప్రతి నియోజకవర్గానికి 100 యూనిట్ల చొప్పున దళిత బంధు అమలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేసి దళితులందరికీ రూ.12 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, హరీష్‌రావు, కేటీఆర్‌లను విమర్శించడం తప్ప ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. 22ఏ భూముల సమస్యపై ప్రజలు ప్రశ్నిస్తే అసెంబ్లీలో చర్చిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి, ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసి చర్చలు ఎవరితో జరుపుతారని ప్రశ్నించారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తివేసి ప్రజాస్వామ్యబద్ధంగా శాసనసభను నడపాలని డిమాండ్ చేశారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులకు ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని, ముఖ్యమంత్రి తన తీరు మార్చుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మేర సత్తయ్య, మోహిజ్, తిరుపతి, నవీన్, పరశురాములు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# జిన్నారం కాలనీలో పోచమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి భూమి పూజ

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 09,:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం డివిజన్ పరిధిలోని జిన్నారం కాలనీలో పోచమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్, గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి తనయుడు, బీజేవైఎం నాయకులు రావుల పృథ్వి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రావుల పృథ్వి మాట్లాడుతూ, జిన్నారం కాలనీ ప్రజలందరిపై పోచమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. దేవాలయ నిర్మాణం ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తై, భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ కమిటీ సభ్యులు, కాలనీ ప్రముఖులు రామాదేవి, యాదగిరి, శ్రీనివాస్, బాబురావు, సంతోష్, నర్సింహ, సంజయ్, సాయి, వెంకటేష్, నాని, వంశీ, భాను, అప్సర్, తోఫీ, నసీమా బేగం, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.



# సర్ ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్
- నిర్మాణంలో ఉన్న భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 09.:** జగిత్యాల రూరల్ మండలం కల్లెడ, తక్కళ్లపెల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను బుధవారం జిల్లా కలెక్టర్ బుడుమజ్జి సత్య ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ఫారాల్లో నమోదైన వివరాల్లో తప్పులను ఎలా సరిచేస్తున్నారు, ఇప్పటివరకు ఎంతమంది ఓటర్లకు నోటీసులు జారీ చేశారు, ఇంకా ఎన్ని నోటీసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎన్ని కేసుల్లో సవరణలు పూర్తయ్యాయి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నోటీసులు జారీ చేసిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణ (హియరింగ్) నిర్వహిస్తున్నారా, ప్రతిరోజూ ఎంతమంది విచారణకు హాజరవుతున్నారు, వారి స్పందన ఎలా ఉందనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విచారణకు ఓటర్లు హాజరవుతున్న తీరు, ప్రజల స్పందనపై అధికారులు వివరించారు. విచారణ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని, నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరవుతున్నారని తెలిపారు. అనంతరం కల్లెడ గ్రామంలో నిర్మిస్తున్న వివో భవనం, తక్కళ్లపెల్లి గ్రామం లో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనం, వివో భవనం పనులను ఆకస్మికంగా పరిశీలించి నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతం చేసి భవనాలను వినియోగం లోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధు సూదన్, తహసీల్దార్ హకీం, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, ఎంపిడిఓ రమాదేవి, స్థానిక నాయకులు, సూపర్ వైజర్లు, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.



# సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే డ్రైవర్ల ప్రధాన లక్ష్యం

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్
- ప్రతి ఒక్క డ్రైవర్ డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవర్చుకోవాలి
- అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి




**జగిత్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 09.:** ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణపై జగిత్యాల ఆర్టీసీ డిపోలో నిర్వహించిన డ్రైవర్ల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ డ్రైవర్లకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారని, వారి సురక్షిత ప్రయాణం డ్రైవర్ల బాధ్యతపై ఆధారపడి ఉంటుందని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా భారీ ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని అన్నారు. ప్రతి డ్రైవర్ రహదారి భద్రతను తన వ్యక్తిగత బాధ్యతగా భావించి విధులు నిర్వహించాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, ప్రమాదకరంగా ఓవర్‌టేకింగ్ చేయడం వంటి వాటికి డ్రైవర్లు దూరంగా ఉండాలని సూచించారు. ప్రయాణికులను సమయానికి గమ్యస్థానాలకు చేర్చాలనే ఉద్దేశంతో వేగంగా వాహనం నడపడం కంటే, ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని తెలిపారు. ప్రతి డ్రైవర్ రహదారిపై ఇతర వాహనదారులు కూడా తప్పులు చేసే అవకాశం ఉందనే విషయాన్ని గుర్తుంచుకుని డిఫెన్సివ్ డ్రైవింగ్ పద్ధతిని పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉద్యోగ నిర్వహణలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలకు తావులేకుండా, సురక్షితంగా విధులు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచిన ముగ్గురు ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శాలువాలతో సన్మానించి అభినందించారు. ఇతర డ్రైవర్లు కూడా వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రమాదరహిత డ్రైవింగ్‌కు కట్టుబడి విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, డీటీఓ మహమ్మద్ సందాని, ఆర్టీసీ ఆర్ఎం రాజు, డిప్యూటీ ఆర్ఎం భూపతి రెడ్డి, టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, డిపో మేనేజర్లు రమేష్, మనోహర్, హరి, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్, ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు.

# సభాపతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీల సభ్యత్వం రద్దు చేయాలి

**మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 09.:** శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాత మధుసూదన్, నవీన్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం తూముకుంటలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం శాసనసభ గౌరవాన్ని కించపరచడమేనని అన్నారు. దళిత వర్గానికి చెందిన వ్యక్తి శాసనసభాపతి పదవిలో ఉండటాన్ని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీలు తాత మధుసూదన్, నవీన్ రెడ్డిల వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు, శాసనసభ గౌరవానికి విరుద్ధంగా ఉన్నాయని శ్రీశైలం గౌడ్ విమర్శించారు. ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీల సభ్యత్వాలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దళిత వర్గానికి చెందిన సభాపతిని కించపరిచే ధోరణి బీఆర్ఎస్ నాయకుల అహంకారానికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. శాసనసభ వంటి అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందన్నారు. వ్యక్తిగత రాజకీయ విమర్శలు హద్దులు దాటి రాజ్యాంగబద్ధమైన పదవులను అవమానించే స్థాయికి చేరుకోవడం దారుణమని శ్రీశైలం గౌడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, అజయ్ యాదవ్ తదితరులతో పాటు దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వినాయక నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేయాలి

**బిక్షపతి యాదవ్ డిమాండ్**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 09,అఖండదీపం:** వినాయక చవితి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని నిజాంపేట సర్కిల్ పరిధిలో నిమజ్జన ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ నాయకులు బిక్షపతి యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీజేపీ నాయకులతో కలిసి కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. శ్రీరాములుకుంట పార్క్, పాపయ్య కుంట, పెద్ద చెరువు తదితర ప్రాంతాల్లో నిమజ్జన ఘాట్లు, క్రేన్లు, లైటింగ్, బారికేడ్లు, పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తాత్కాలిక నిమజ్జన కొలనులు, బేబీ పాండ్స్, ఎర్త్ పిట్స్ వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిమజ్జన ఏర్పాట్ల కోసం సుమారు రూ.25 లక్షల నిధులు మంజూరైనా పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆయన ఆరోపించారు. మొదటి ఆదివారం నాటికే 70 శాతానికి పైగా నిమజ్జనాలు జరిగే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మట్టి, ఎకో ఫ్రెండ్లీ గణపతి విగ్రహాలను ప్రోత్సహించాలని, పీఓపీ విగ్రహాలపై నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోరారు. పోలీసు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని బిక్షపతి యాదవ్ విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రసాద్ రాజు, సుమన్ రావు, శ్రీధర్ రెడ్డి, సచిన్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సెక్యూరిటీ కార్మికులకు రావాల్సిన రూ.50 వేల వేతనం ఇప్పించిన కార్మిక నాయకుడు రవి

- బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి చొరవ

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 09.:** బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియాలో సెక్యూరిటీ కార్మికులకు రావాల్సిన వేతనాలను బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి చొరవతో ఇప్పించారు. వివరాల్లోకి వెళితే.. 2022 సంవత్సరంలో బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియాలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేసిన ముగ్గురు కార్మికులకు సుమారు రూ.50 వేల వేతనం రావాల్సి ఉంది. అయితే సెక్యూరిటీ కాంట్రాక్టర్ టీఎం మిత్రా వేతనాలు చెల్లించకపోవడంతో ఆ ముగ్గురు సెక్యూరిటీ గార్డులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుమార్లు వేతనాల కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవడంతో వారు విధులకు దూరమయ్యారు. తమకు న్యాయం చేయాలని భావించిన సెక్యూరిటీ కార్మికులు తోటి కార్మికుల ద్వారా బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు రవి గురించి తెలుసుకుని ఆయన కార్యాలయాన్ని సంప్రదించి తమ సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన రవి బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియాకు వెళ్లి సంబంధిత కంపెనీ యాజమాన్యంతో, సెక్యూరిటీ కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. ముగ్గురు సెక్యూరిటీ కార్మికులకు రావాల్సిన మొత్తం రూ.50 వేల వేతనాన్ని వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. చాలా కాలంగా తమకు రావాల్సిన వేతనాల కోసం ఎదురుచూస్తున్న తమకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవికి సెక్యూరిటీ కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా రవి తెలిపారు. ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవానికి గూడ ఐలయ్య గౌడ్‌కు ఆహ్వానం

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 09.:** శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవానికి హాజరు కావాల్సిందిగా కాంగ్రెస్ నాయకుడు, ఓబీసీ జాతీయ అధ్యక్షుడు గూడ ఐలయ్య గౌడ్ దంపతులకు ఆహ్వానం అందించారు. జగద్గిరిగుట్ట రోడామేస్త్రి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ గూడ వరమ్మ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. జగద్గిరిగుట్టలోని శ్రీ గోవిందాంబ సమేత శ్రీ మద్ది విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కంచరి హనుమంతాచారి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శ్రీరాములు, శ్రీనివాస్ చారి, రాజు చారి, మనోహర్ చారి, తిరుపతి చారి, శ్రీశైలం చారి, రమేష్ చారి, రామాచారి తదితరులు గూడ వరమ్మ, గూడ ఐలయ్య గౌడ్ దంపతులకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ విశ్వకర్మలు ప్రజలకు మానసిక ప్రశాంతతను కలిగించడంతో పాటు సనాతన ధర్మానికి ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలనలో సకల జనుల సంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గూడ ఐలయ్య గౌడ్ కోరారు.



# రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



- రైతులకు ఎల్లవేళలా అందుబాటులో, అండగా ఉంటా
- యువ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 09.:** రైతుల సమస్యల పరిష్కారమే తన లక్ష్యం అని, రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారికి అండగా నిలుస్తానని యువ పారిశ్రామికవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. రైతులకు కనీసం 18 గంటల పాటు నిరంతర విద్యుత్ అందించాలని, ప్రస్తుతం కేవలం 10 గంటల కరెంట్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతు పంటను కాపాడాలంటే విద్యుత్ సరఫరాను వెంటనే పెంచాలని వంగ రాజేశ్వర్ రెడ్డి అని డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యపై రైతుల గొంతుకగా బుధవారం అధికారుల దృష్టికి సమస్యను వంగ రాజేశ్వర్ రెడ్డి తీసుకెళ్లారు. రైతు కష్టాల్లో ఉన్నప్పుడు రాజకీయాలకు అతీతంగా రైతు పక్షాన నిలబడటమే తన బాధ్యతని వంగ రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా నిర్వహించిన ఈ రైతు ర్యాలీలో పాల్గొని రైతుల సమస్యలకు తన పూర్తి మద్దతు ప్రకటించారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు రైతులకు సరైన సమయానికి విద్యుత్ సరఫరా చేయాలని కోరుతూ ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వంగ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట చుట్టుపక్కల కాల్వలు ఉన్నప్పటికీ చెరువుల్లోకి సాగునీరు చేరకపోవడం దురదృష్టకరమని, వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతుల పంటలను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి, అందుబాటులో ఉన్న నీటి వనరులను వినియోగిస్తూ చెరువులు, కుంటలను నీటితో నింపేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే రైతులకు అవసరమైన సమయంలో నిరంతరాయంగా విద్యుత్ అందించాలని వంగ రాజేశ్వర్ రెడ్డి అధికారులను విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ పార్టీయే పేదల సొంతింటి కల నెరవేర్చేది

**గజ్వేల్ ప్రతినిధి (కుకునూరుపల్లి), సెప్టెంబర్ 09:** పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ వీరపాక శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందారి అయిలయ్య అన్నారు. బుధవారం కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రతి పేద కుటుంబానికి కొండంత భరోసానిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ సిర్పోజి నరసింహా చారి, నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



చురకలు



## ఉప సర్పంచుల ఫోరం కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఉపాధ్యక్షులుగా దుర్గం తిరుపతి



**కొమురంభీం ఆసిఫాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 09,:** ఉప సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో ఉప సర్పంచుల పాత్రను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఉప సర్పంచుల ఫోరం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఉపాధ్యక్షులుగా గోలేటి గ్రామ ఉప సర్పంచ్ దుర్గం తిరుపతిని నియమించారు. రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తీక్, జిల్లా అధ్యక్షులు దీపక్ ముండే సమక్షంలో బుధవారం దుర్గం తిరుపతిని జిల్లా ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దుర్గం తిరుపతి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్, జిల్లా అధ్యక్షులు దీపక్ ముండేలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఉప సర్పంచుల సమస్యలను రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఉప సర్పంచులకు ఎదురవుతున్న సమస్యలు, అధికారాలు, విధులు, నిధులకు సంబంధించిన అంశాలపై సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. దుర్గం తిరుపతికి జిల్లా ఉపాధ్యక్షుల బాధ్యతలు అప్పగించడంపై గోలేటి గ్రామ ప్రజలు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## పార్టీలో పదవులు రాని వారు నిరాశ చెందొద్దు

**పదవులు వచ్చినా రాకున్నా నేను అందరినీ గుర్తిస్తా**

**త్వరలోనే మండలాల వారిగా సమావేశాలు ఏర్పాటు చేస్తా**

**ప్రతి కార్యకర్తతో నేరుగా మాట్లాడతా**

**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**




**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 09,:** సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కమిటీల నియామక సమావేశం బుధవారం సంగారెడ్డి పట్టణంలోని క్లాసిక్ గార్డెన్స్‌లో జరిగింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో నియోజకవర్గం లోని నాలుగు మండలాల కాంగ్రెస్ పార్టీ కమిటీలను ప్రకటించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా, ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ కిసాన్ సెల్‌తో పాటు ఇతర ఆర్గనైజేషన్ల కమిటీలను సైతం ప్రకటించారు. ఈ సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మాట్లాడుతూ పార్టీకి పదవులు వచ్చిన వారు, రాని వారు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ గుర్తించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీలో పదవులు రాని వారు ఎలాంటి నిరాశకు గురికావద్దని, పదవులు ఉన్నా లేకపోయినా ప్రతి కార్యకర్తను తాను గుర్తిస్తానని జగ్గారెడ్డి అన్నారు. అందరూ కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

### అధికారులతో సమీక్ష సమావేశాలు

సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై త్వరలో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు. నాలుగు మండలాలకు చెందిన గెలిచిన, ఓడిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో అధికారుల సమక్షంలో ప్రత్యేక రివ్యూ సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. అదేవిధంగా రెండు మున్సిపాలిటీలకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, అధికారులతోనూ ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 30 నుంచి నాలుగు రోజుల పాటు వరుసగా సమావేశాలు నిర్వహించి, ప్రతి ఒక్కరితో నేరుగా మాట్లాడతానని చెప్పారు. ఈ సమావేశాలకు పోలీసు శాఖతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను కూడా పిలిచి ప్రజా సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి అంశాలపై చర్చిస్తామని జగ్గారెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు.

## అన్ని సంఘాలకు సమాన హోదా కల్పించాలి

**తాండూర్, సెప్టెంబర్ 09,:** అధికార, ప్రాతినిధ్య సంఘాల కాల పరిమితి ముగిసిన నేపథ్యంలో బుధవారం నుంచి అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నాయకులు పేర్కొన్నారు. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడి ఆదేశాలు, బెల్లంపల్లి వైస్ ప్రెసిడెంట్ సూచనల మేరకు ఏరియా వర్క్షాప్ పిట్ కమిటీ ఆధ్వర్యంలో ఏరియా వర్క్షాప్ ఇంచార్జ్ డిప్యూటీ ఎస్ఈ నరేష్కు బుధవారం వినతి పత్రం అందజేశారు. యాజమాన్యం నిర్వహించే ప్రతి కార్యక్రమానికి అన్ని కార్మిక సంఘాలను ఎలాంటి వివక్ష లేకుండా ఆహ్వానించాలని కోరారు. అధికార సంఘం పేరుతో ప్రతి కార్మికుడి నుంచి చందాగా వసూలు చేస్తున్న రూ.50ను తక్షణమే నిలిపివేయాలని తెలిపారు. వీలైనంత త్వరగా తదుపరి కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా వర్క్షాప్ పిట్ సెక్రటరీ గజవెని శ్రీనివాస్, ఏరియా జాయింట్ సెక్రటరీ జి.వెంకట్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ ఎస్.సురేష్, నాయకులు వైకుంఠం, ఎస్.వెంకటేశ్వర్లు, కనకయ్య, వెంకటస్వామి, అంజయ్య, చంద్రయ్య, మహిళా కార్మికులు, వర్క్షాప్ కార్మికులు పాల్గొన్నారు.

## ప్రజా కవి కాళోజీ జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయం

- **సామాజిక, రాజకీయ చైతన్యానికి కాళోజీ చేసిన కృషి చిరస్మరణీయం**
- **సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**




**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 09,:** ప్రజా కవి కాళోజీ నారాయణరావు జీవితం, ఆయన సాహిత్య స్ఫూర్తి, ప్రజా సమస్యలపై ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ పాండు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తన రచనల ద్వారా ప్రజల సమస్యలు, ఇబ్బందులను ఎప్పటికప్పుడు సమాజం ముందుకు తీసుకువచ్చి ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని నింపారని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, సామాన్యుల గొంతుకగా తన సాహిత్యాన్ని మలిచిన కాళోజీ ప్రజా కవిగా చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. సమాజంలోని అసమానతలు, ప్రజల సమస్యలు, సామాజిక పరిస్థితులపై తనదైన శైలిలో స్పందిస్తూ ప్రజలను చైతన్యపరిచిన మహనీయుడు కాళోజీ అని కొనియాడారు. కాళోజీ ఆలోచనా విధానం, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత కాళోజీ జీవితం, సాహిత్యం, ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ కాళోజీ కేవలం కవిగా మాత్రమే కాకుండా సామాజిక చైతన్యవేత్తగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని అన్నారు. ఆయన సాహిత్యం నేటికీ ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తోందని, కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్, డీపీఆర్వో విజయలక్ష్మి , కలెక్టరేట్ ఏఓ విజయలక్ష్మి , వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణి పాఠశాలకు అరుదైన గౌరవం

- **'సాంప్రదాయ వస్త్రధారణ' పోటీలో జతిన్ కుమార్ రెడ్డికి మూడో బహుమతి**

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 09,:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని త్రివేణి టాలెంట్ స్కూల్ (చింతల్ బ్రాంచ్)కు అరుదైన గౌరవం లభించింది. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బుధవారం మహాకవి కాళోజి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన 'తెలుగు భాషా–సాంస్కృతిక ఉత్సవాలు–2026' లో భాగంగా నిర్వహించిన పోటీల్లో పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటాడు. త్రివేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థి బి. జతిన్ కుమార్ రెడ్డి 'సాంప్రదాయ వస్త్రధారణ' పోటీలో అద్భుత ప్రతిభ కనబరిచి మూడో బహుమతి సాధించాడు. సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకునే ప్రదర్శనతో న్యాయనిర్ణేతలను మెప్పించి విజేతగా నిలిచాడు. అనంతరం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో తెలంగాణ రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి పార్థసారథి చేతుల మీదుగా జతిన్ కుమార్ రెడ్డి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నాడు. ఈ సందర్భంగా పార్థసారథి విద్యార్థిని అభినందిస్తూ, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులకు, పాఠశాలకు, ప్రాంతానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో సీఎస్ఓ సుబ్బారావు, సీఆర్ఓ వెంకట్రావు పాల్గొని జతిన్ కుమార్ రెడ్డి ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శివకీర్తన మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతో పాటు తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు, సాంస్కృతిక వేదికలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. మూడో బహుమతి సాధించి పాఠశాలకు కీర్తిప్రతిష్ఠలు తీసుకొచ్చిన జతిన్ కుమార్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. విద్యార్థి విజయంపై తల్లిదండ్రులు సైతం హర్షం వ్యక్తం చేశారు.



## భాగ్యరథి బిజినెస్ ఎక్స్‌పో–2026 ఘనంగా

- **విద్యార్థులు ఉద్యోగదాతలుగా ఎదగాలి: పారిశ్రామికవేత్త వీ. విద్యాసాగర్**



**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, సెప్టెంబర్ 09,:** చింతల్‌లోని భాగ్యరథి డిగ్రీ కళాశాలలో విద్యార్థుల్లో వ్యాపార దృక్పథం, సృజనాత్మకత, నూతన ఆలోచనలు, పారిశ్రామిక స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో "భాగ్యరథి బిజినెస్ ఎక్స్‌పో–2026"ను బుధవారం ఘనంగా నిర్వహించారు. 300 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త వీ. విద్యాసాగర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. కామర్స్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించి యూనివర్సిటీ స్కాలర్‌షిప్ పొందిన ఆయన, చార్టర్డ్ అకౌంటెన్సీ విద్యను అభ్యసిస్తూనే 1982లో వ్యాపార రంగంలోకి ప్రవేశించారు. చిన్న స్థాయి నుంచి ప్రారంభమైన ఆయన వ్యాపార ప్రస్థానం అల్యూమినియం, ల్యాడర్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు తదితర రంగాలకు విస్తరించింది. అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పరచుకుని విదేశీ మార్కెట్లకు ఉత్పత్తులను తీసుకెళ్లారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ, "విజయానికి మంచి మార్కులు, ఉద్యోగం మాత్రమే సరిపోవు. కల, కష్టపడే తత్వం, పట్టుదల, కొత్తగా ఆలోచించే ధైర్యం అవసరం" అన్నారు. నేటి జెన్–జెడ్ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత పుష్కలంగా ఉన్నాయని, వాటిని వ్యాపార అవకాశాలుగా మలుచుకోవాలని సూచించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా భవిష్యత్తులో ఉద్యోగాలు కల్పించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్‌కు రూ.2,000 చొప్పున నగదు ప్రోత్సాహకం అందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఎక్స్‌పోలో 12 స్టాల్స్ ద్వారా స్కిల్‌మేట్, ఫుడ్ అడల్టరేషన్, బడ్జెట్ ప్లానింగ్, బోటానికల్ బ్లీస్, ఆర్గానిక్ ఫర్టిలైజర్స్, స్టాక్ మార్కెట్, వాటర్ కన్జర్వేషన్ అండ్ ఫిల్టరింగ్, ఆరా ఆఫ్ హ్యాండ్లూమ్స్ తదితర అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. కళాశాల డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులను ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగదాతలుగా తీర్చిదిద్దడమే కళాశాల లక్ష్యమన్నారు. ఎక్స్‌పో ద్వారా ప్రాక్టికల్ నాలెడ్జ్, మార్కెటింగ్, కమ్యూనికేషన్, టీమ్ వర్క్, బిజినెస్ మేనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్ రాజ్, అధ్యాపక, బోధనేతర సిబ్బంది, అకాడమిక్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

- **అవార్డులు అందజేసిన ఎంపిడిఓ స్వరూప**

**చొప్పదండి/కొడిమ్యాల, సెప్టెంబర్ 09, :** తెలంగాణ ప్రభుత్వం కొడిమ్యాల మండల విద్యా శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమం మండల విద్యాధికారి అయిత శ్రీనివాస్ అధ్యక్షతన కొడిమ్యాల మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిడిఓ స్వరూప మాట్లాడుతూ ఉపాధ్యాయులు జాతిని నిర్మించడానికి సమాజాన్ని నిర్మించడానికి ఈ రంగంలోకి రావడం జరిగిందని, ఈ సందర్భంగా మండలంలోని ఉత్తమ అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులు జాతిని నిర్మించడానికి సమాజాన్ని నిర్మించడానికి ఈ రంగంలోకి రావడం జరిగిందని, ఉపాధ్యాయులు ఈ రంగంలో కొనసాగడం పట్ల గర్వాంగా ఫీల్ అవ్వాలని అన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు బూట్ల రాజమల్లయ్య, బాబూరావు, శ్రీదేవి, వెంకటలక్ష్మి , నాగరాజు, సుమలత, తిరుపతి, శిరీష రెడ్డి, సుచరిత, స్వర్ణ, పద్మ, మాధవి, రోహిణి, పద్మ, అయోధ్యం, వాసుదేవరావు, శ్రీనివాస్, ప్రశాంత్, బాలకృష్ణ, సదయ్య, షౌకత్ అలీ, అనిత లకు ఎంపిడిఓ చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు తునికి శ్రీనివాసరాజు, ఆచి విజయేంద్ర, బి. జోష్ణ దేవి, తపస్ రాష్ట్ర కార్యదర్శి వీరమల్ల వెంకట రమణ రావు, మండల అధ్యక్షులు ఏనుగు ఆదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజగంగయ్య, వివిధ ఉపాధ్యాయ మండల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు, వివిధ పాఠశాలల నుండి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## వైభవంగా శ్రీ బీరప్ప మహంకాలమ్మ వార్షికోత్సవం

**గజ్వేల్ ప్రతినిధి (కుకునూరుపల్లి), సెప్టెంబర్ 09,:** గజ్వేల్ నియోజకవర్గంలోని మండల కేంద్రమైన కుకునూరుపల్లి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ బీరప్ప, మహంకాలమ్మ వార్షికోత్సవ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాణిక్యం పంతులు పర్యవేక్షణలో స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు శాంతి హోమం జరిపించారు. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని కోరుకుంటూ ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుకునూరుపల్లి మాజీ సర్పంచ్ బోటపట్ల ఐలం శివ, కురుమ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు





# నిబద్ధతకు ప్రతిరూపం రాఘవాచారి

## నేడు సంపాదక "చక్రవర్తుల" జన్మదినం

నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, విలువలు, నిబద్ధతతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచిన పాత్రికేయులు, సంపాదకులు చక్రవర్తుల రాఘవాచారి. నిరంతరం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎనలేని సేవలు చేశారు. రాఘవాచారి స్వస్థలం వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురం. 1939 సెప్టెంబరు 10న ఆయన జన్మించారు. నిబద్ధతత, విలువలతో కూడిన జర్నలిజానికి మారుపేరుగా నిలిచారు. తెలుగు పబ్లిక్ రచయితల్లో నిరుప మానమైన మేధావి చక్రవర్తుల రాఘవాచారి, తెలుగు, ఇంగ్లీష్ సంస్కృత భాషల్లో పండితుడు. పాత్రికేయుడు, సీనియర్ జర్నలిస్ట్. 1972 నుండి 2005 వరకు విశాలాంధ్రలో సంపాదకుడిగా పనిచేశాడు. ఆయన మూర్తీభవించిన నిజాయితీపరుడు. ఆయన వృత్తిలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సాంప్రదాయక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. అయిదో ఏటి నుంచి ప్రబంధాలు, ప్రాచీన కావ్యాలు రామాయణ మహాభారతాలు చదివారు. ఆయనకు ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ నేర్పడానికి ముగ్గురు ఉపాధ్యాయులను నియ మించారు. సంస్కృతం నేర్చు కోవడానికి ఆయనను ఆంధ్ర ప్రాంతంలోని పొన్నూరు పంపించారు. వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం శాతా పురం గ్రామంలో జన్మించిన రాఘవాచారి సికింద్రాబాద్ సమీపంలోని లాలాగూడ రైల్వే పాఠశాలలో 11వ ఏట అయిదో తరగతిలో చేరారు. 1953 నుంచి విశాలాంధ్ర చదవడం ప్రారంభించాడు. నిజాం కళాశాలలో పి.యు.సి.లో చేరి, ఉస్మానియా విశ్వవిద్యాలయం 6వ ర్యాంకు సాధించాడు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఇంజనీరింగ్ కాలేజీలో చేరారు. కానీ ఇంజనీరింగు రెండో సంవత్సరంలోకి వచ్చేటప్పటికి ఆయనకు చదువు మీద ఆసక్తి తగ్గింది. వరంగల్ వెళ్లి బీఎస్సీలో చేరారు. కమ్యూనిస్టు పార్టీ అనుబంధ విద్యార్థి సంఘంలో చేరారు. కళాశాల విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేసి అద్భుతమైన మెజారిటీతో గెలిచారు. పట్టభద్రుడైన తరువాత హైదరాబాద్ వచ్చి న్యాయశాస్త్రం చదివారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ప్రతినిధిగా లా కళా శాల విద్యార్థి సంఘం అధ్యక్ష స్థానానికి పోటీ చేశారు. అప్పుడు విశ్వ విద్యాలయంలో ఎం.ఎ. ఇంగ్లిష్ చదువుతున్న ఎస్. జైపాల్ రెడ్డి వంటి వారు తీవ్రమైన వ్యతిరేక ప్రచారం చేసినా రాఘవాచారి అఖండ విజయం సాధించారు. న్యాయ శాస్త్రంలో పట్ట భద్రుడైన తరువాత ఎల్.ఎల్.ఎం. చేశారు. 1969–71 మధ్య ఆయన ఢిల్లీ నుంచి వెలువడే వామపక్ష అనుకూల ఇంగ్లీష్ పత్రిక విలేకరిగా పని చేశారు. 1971లో ఆయన విజయవాడ వెళ్లి విశాలాంధ్రలో చేరారు. కొద్ది కాలానికే ఆ పత్రికకు సంపాదకుల య్యారు. 28 ఏళ్ల సుదీర్ఘ కాలం విశాలాంధ్ర సంపాదకులుగా ఉన్నారు. ఆయన సంపాదకీయాలు సూటిగా, స్పష్టంగా ఉండేవి. స్పష్టత, సంక్షిప్తత ఆయన శైలి. 'తెలుగు పత్రిక పరిణామం – ప్రయోగాలు – ప్రయోజనం' అన్న వ్యాసంలో తెలుగు పత్రికా రంగంలో వాడే భాషా ప్రామాణీకరణ జరగలేదని విచారం వ్యక్తం చేశారు. విజయ వాడ, ఇతర ప్రాంతాలలోనూ ఉపన్యాసకుడిగా ఆయనను ఆహ్వానించే వారు. ఆయన మాటల్లో అడుగడుగునా వ్యంగ్యం తొణికిస లాడేది. ఆయన గొప్పవాడిగా కనిపించే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు. మేధావిగా ఆయనకు ఎంత గుర్తింపు ఉన్నా ఎనిమిది పదుల వయసు నిండినాకా, ఆయనతో మాట్లాడిన వారు ఎవరైనా ఆయన జ్ఞాన విస్తృతి చూసి ముచ్చట పడేవారు. నిబద్ధత కలిగి, విలువలకు జీవితాంతం కట్టుబడిన కమ్యూనిస్టుగా విజ్ఞానఖనిగా రాఘవాచారి పేరు గాంచారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యార్థి ఉద్యమానికి ఆయన అందించిన సేవలు ఎనలేనివి. 30 ఏళ్ల పాటు విశాలాంధ్ర సంపాదకులుగా బాధ్యతలు నిర్వర్తించిన రాఘవాచారి. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్‌గా, సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ సభ్యులుగా సేవలందించారు. 1972లో విశాలాంధ్ర ఎడిటర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాఘవాచారి 2005 వరకు కొనసాగారు. రాఘవాచారి, హైదరాబాదులోని ఒక హాస్పిటల్‌లో చికిత్సపొందుతూ 2019, అక్టోబరు 28వ తేది తెల్లవారుజామున మరణించాడు. తెలుగు పత్రికా రంగానికి ఆయన చేసిన సేవను తెలుగు ప్రజలు ఎప్పుడూ గుర్తించుకునే, ఉదాత్తమైన వ్యక్తిత్వం ఉన్న రాఘవాచారి నిస్సందేహంగా మేధావి అయన.



రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత

**నేడు ఆత్మహత్యల నివారణ దినోత్సవం**

**మనిషికి వివేచన ఉంది.. విచక్షణ ఉంది.. సమస్యను ఎదుర్కొనే శక్తి ఉంది. అయినా ఒక్కోసారి ఆవేదన, ఆవేశం, నిరాశ, నిస్పృహ, ఒంటరితనం మనసును కమ్మేస్తాయి. ఆ క్షణంలో జీవితం ఇక ముందుకు సాగదేమోనన్న భావన కలుగుతుంది. కానీ ఏ సమస్యా శాశ్వతం కాదు. ఆత్మహత్య మాత్రం తిరిగి సరిదిద్దుకోలేని నిర్ణయం. అందుకే ఆత్మహత్యల నివారణ అనేది ఒక వ్యక్తికో, కుటుంబానికో పరిమితమైన అంశం కాదు. అది సమాజం మొత్తం స్వీకరించాల్సిన బాధ్యత.**




ప్రేమ, అనుబంధాల్లో వైఫల్యం.. ఆత్మీయులను కోల్పోవడం.. కుటుంబ కలహాలు.. అనారోగ్యం.. అప్పులు.. ఆర్థిక ఇబ్బందులు.. నిరుద్యోగం.. ఉద్యోగం లేదా సామాజిక హోదా కోల్పోవడం.. పరీక్షల్లో వైఫల్యం.. ఆశించిన ర్యాంకు రాకపోవడం.. వ్యాపార నష్టాలు.. వ్యవసాయంలో నష్టం.. మోసపోవడం.. మద్యానికి బానిస కావడం.. భార్యాభర్తల మధ్య విభేదాలు.. ఒంటరితనం.. ఇలా అనేక పరిస్థితులు కొందరిలో తీవ్ర మానసిక ఒత్తిడికి కారణమవుతాయి. అయితే వీటిలో ఏ ఒక్క కారణాన్నీ ఆత్మహత్యకు సరళమైన కారణంగా చూడలేం. మానసిక ఆరోగ్యం, వ్యక్తిగత పరిస్థితులు, సామాజిక–ఆర్థిక ఒత్తిళ్లు, సంబంధాలు, వ్యసనాలు వంటి అనేక అంశాలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉండవచ్చు. ఆత్మహత్యతో ఒక ప్రాణమే ముగిసిపోదు. ఆ వ్యక్తితో అనుబంధం ఉన్న కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులపై తీవ్ర మానసిక ప్రభావం పడుతుంది. "మనమే ఇంకాస్త మాట్లాడి ఉంటే..? బాధను ముందే గుర్తించి ఉంటే..? అండగా నిలిచి ఉంటే..?" అనే ప్రశ్నలు వారిని చాలాకాలం వెంటాడవచ్చు. కాలంతో పాటు జీవనశైలిలో వచ్చిన మార్పులూ మనుషుల మధ్య సంబంధాలను ప్రభావితం చేస్తున్నాయి. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాల్లో కష్టం వచ్చినప్పుడు పంచుకునేందుకు ఎక్కువ మంది ఉండేవారు. ఇప్పుడు చిన్న కుటుంబాలు, ఉద్యోగ ఒత్తిళ్లు, ఆర్థిక పోటీ, సామాజిక మాధ్యమాల్లో పోలికలు, ఒంటరితనం వంటి పరిస్థితులు కొందరిలో ఒత్తిడిని పెంచుతున్నాయి. హిందూ, ఇస్లాం, క్రైస్తవం సహా వివిధ మత సంప్రదాయాలు మానవ జీవితానికి అత్యున్నత విలువను ఇచ్చాయి. కష్టాలను ఎదుర్కొంటూ జీవితాన్ని కొనసాగించాలనే సందేశాన్నే ప్రధానంగా బోధించాయి. అయితే ఆత్మహత్య ఆలోచనలతో బాధపడుతున్న వ్యక్తిని పాపం, నేరం, అపరాధం అనే ముద్రలతో మరింత కుంగదీయడం పరిష్కారం కాదు. వారికి అవసరమైనది తీర్పు కాదు.. తోడు. నింద కాదు.. భరోసా. శిక్ష కాదు.. చికిత్స. "నేను బతికి ఏం ప్రయోజనం?", "అందరికీ భారంగా మారాను", "ఇక నా వల్ల కాదు" వంటి మాటలను తేలిగ్గా తీసుకోకూడదు. తీవ్రమైన నిరాశ, అకస్మాత్తుగా అందరికీ దూరమవడం, రోజువారీ పనులపై ఆసక్తి కోల్పోవడం వంటి మార్పులు కనిపిస్తే కుటుంబ సభ్యులు, స్నేహితులు అప్రమత్తంగా ఉండాలి. అలాంటి సమయంలో ఉపన్యాసాలు ఇవ్వడం కంటే వారి మాట వినడం ముఖ్యం. "నీకు నేనున్నాను" అనే భరోసా ఇవ్వాలి. అవసరమైతే మానసిక ఆరోగ్య నిపుణులు, వైద్యుల సహాయం తీసుకునేలా ప్రోత్సహించాలి. అత్యవసర ప్రమాదం ఉందని అనిపిస్తే వ్యక్తిని ఒంటరిగా వదలకుండా తక్షణ వైద్య సహాయం అందించాలి. ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని నేరస్థుడిగా చూడాలనే పాత దృక్పథంలోనూ కాలక్రమేణా మార్పు వచ్చింది. తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉన్న వ్యక్తికి చికిత్స, సంరక్షణ, పునరావాసం అందించాలన్న భావనకు ప్రాధాన్యం పెరిగింది. ఇది అత్యంత అవసరమైన మానవీయ మార్పు. ఎందుకంటే ఆత్మహత్యాయత్నం నుంచి బయటపడిన వ్యక్తికి మొదట కావాల్సింది పోలీసు భయం కాదు.. కుటుంబం చేయూత. సమాజం నుంచి అవమానం కాదు.. ఆదరణ. తన సమస్యను చెప్పుకునే అవకాశం, సరైన వైద్య సహాయం, తిరిగి జీవితంపై ఆశ కలిగించే వాతావరణం అవసరం.




### ఆత్మహత్యలను నివారించవచ్చు

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం ప్రతి ఏటా సెప్టెంబర్ 10న నిర్వహించడానికి ప్రధాన ఉద్దేశం కూడా ఇదే. ఆత్మహత్యలపై అపోహలు తొలగించడం, మానసిక ఆరోగ్యంపై బహిరంగంగా మాట్లాడే వాతావరణం కల్పించడం, ప్రమాదంలో ఉన్నవారిని ముందుగానే గుర్తించడం, వారికి అవసరమైన సహాయం అందించడం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చనే సందేశాన్ని సమాజంలోకి తీసుకెళ్లడం దీని లక్ష్యం. ప్రభుత్వాలు మానసిక ఆరోగ్య సేవలను గ్రామస్థాయి వరకు అందుబాటులోకి తీసుకురావాలి. విద్యాసంస్థల్లో కౌన్సెలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలి. రైతులు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు సహా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొనే వర్గాలకు ప్రత్యేక సహాయక వ్యవస్థలు అవసరం. కుటుంబాల్లోనూ పిల్లల మార్కులు, ఉద్యోగాలు, సంపాదన, విజయాలను మాత్రమే కొలమానంగా చూడకుండా వారి మనసును అర్థం చేసుకునే ప్రయత్నం జరగాలి. ఓటమి జీవితానికి ముగింపు కాదు. వైఫల్యం భవిష్యత్తుకు తాళం వేయదు. ఈరోజు కనిపించని పరిష్కారం రేపు కనిపించవచ్చు. అందుకే ఆత్మహత్య గురించి ఆలోచిస్తున్న మనిషికి "చావొద్దు" అని చెప్పడం ఒక్కటే కాదు.. "నీ బాధ చెప్పు.. నీతో మేమున్నాం" అని చేయి అందించాలి. ఒక మాట.. ఒక పలకరింపు.. ఒక భరోసా.. అవసరమైన సమయంలో అందిన వైద్య సహాయం ఒక నిండు ప్రాణాన్ని నిలబెట్టవచ్చు. ఆత్మహత్యల నివారణ నిజంగా అందరి సామాజిక బాధ్యతే.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# తెలుగు భాషా సౌందర్యం.. విశ్వనాథ సాహితీ ప్రాభవం!

**నేడు తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, కవి సామ్రాట్ జయంతి**

**తెలుగు సాహిత్య ప్రక్రియల్లో చెరిపేయలేని ముద్ర వేసిన మహామనీషి**





తెలుగు సాహిత్య జగత్తులో విశ్వనాథ సత్యనారాయణ ఒక శిఖరాగ్రం. విశ్వనాథ వారు స్పృశించని సాహిత్య ప్రక్రియ లేదు, ఆయన అక్షరం తాకని భావోద్వేగం లేదు. తెలుగు భాషకు తొలి జ్ఞానపీఠ పురస్కారాన్ని అందించి, తెలుగువారి ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసిన ఆ కవి సామ్రాట్ జయంతి (సెప్టెంబరు 10) సందర్భంగా ప్రత్యేక స్మరణాంజలి. విశ్వనాథ 1895, సెప్టెంబరు 10న కృష్ణా జిల్లా నందమూరు గ్రామంలో శోభనాద్రి, పార్వతమ్మ దంపతులకు జన్మించారు. బందరు హైస్కూలులో తిరుపతి వేంకట కవులలో ఒకరైన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి వద్ద విద్యాభ్యాసం చేయడం ఆయన జీవితంలో ఒక గొప్ప మలుపు. ఉద్యోగం చేస్తూనే ఎం.ఏ సాధించిన ఆయన బందరు, గుంటూరు, విజయవాడ, కరీంనగర్ వంటి ప్రాంతాల్లోని కళాశాలల్లో అధ్యాపకుడిగా, ప్రాచార్యుడిగా వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దారు. జాతీయోద్యమ సమయంలో గాంధీజీ పిలుపునకు స్పందించి కొంతకాలం ఉద్యోగానికి కూడా రాజీనామా చేశారు.

### సాహితీ వృక్షం - వైవిధ్యభరిత రచనలు

1916లో 'విశ్వేశ్వర శతకము'తో ప్రారంభమైన ఆయన రచనా ప్రస్థానం అప్రతిహతంగా సాగింది. 25 పైచిలుకు కావ్యాలు, 88 నవలలు, 15 నాటకాలు, 6 శతకాలు, 10 సంస్కృత నాటకాలు, విమర్శన గ్రంథాలు అందించి విలక్షణ రచయితగా నిలిచారు. మహోన్నత కావ్యాలు: ఆయన రచించిన 'శ్రీమద్రామాయణ కల్పవృక్షము' అత్యున్నత 'జ్ఞానపీఠ' పురస్కారాన్ని తెచ్చిపెట్టింది.

**వేయిపడగలు:** భారతీయ సంస్కృతి, జీవన విధానాన్ని ఆవిష్కరించిన ఈ నవలను మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు 'సహస్రఫణ్' పేరుతో హిందీలోకి అనువదించారు.

**ఏకవీర:** ఈ నవల మలయాళం, తమిళ భాషల్లోకి అనువాదమవ్వడమే కాకుండా, చలనచిత్రంగా కూడా రూపుదిద్దుకుంది.

### బిరుదులు - పురస్కారాలు

తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవలకుగాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు (విశ్వనాథ మధ్యాక్కఱలు), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవి గౌరవం, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి 'కళాప్రపూర్ణ', కేంద్ర ప్రభుత్వం నుంచి 'పద్మభూషణ్' పురస్కారాలు లభించాయి. గురువైన చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి సైతం తన శిష్యుని కవితా పటిమను చూసి "కవితా సమ్రాట్" అని ప్రశంసించారు. సంప్రదాయానికి, తెలుగుదనానికి పెద్దపీట వేస్తూనే విశ్వనాథ వారు సృష్టించిన సాహిత్యం నేటికీ, ఏటికీ చిరస్మరణీయమే. 1976 అక్టోబరు 18న ఆయన దివంగతులైనా, ఆయన అందించిన అక్షర నిధి తెలుగువారి గుండెల్లో నిరంతరం ప్రకాశిస్తూనే ఉంటుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494



# వరద గుప్పిట్లో ఆసియా క్రీడల వేదిక!

## నాగోయాలో కుండపోత వర్షాలు

## అథ్లెట్లను సురక్షిత ప్రాంతాలకు తరలింపు

## గంటలోనే 104 మిల్లీమీటర్ల వర్షపాతం

## రవాణా సేవలకు తీవ్ర అంతరాయం

## క్రీడలకు ఇబ్బంది లేదంటున్న అధికారులు

**నాగోయా, సెప్టెంబర్ 9 (చురకలు):** జపాన్‌లో జరగనున్న ఆసియా క్రీడలపై భారీ వర్షాలు, వరదల ప్రభావం పడుతోంది. క్రీడలకు ప్రధాన వేదికగా ఉన్న నాగోయాలో కుండపోత వర్షాలు కురుస్తుండటంతో ముందు జాగ్రత్తగా వందలాది మంది అథ్లెట్లు, సహాయక సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే పోటీ వేదికలకు ఎలాంటి నష్టం జరగలేదని, నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే క్రీడలు జరుగుతాయని నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. నాగోయాలో మంగళవారం ఒక్క గంట వ్యవధిలోనే 104 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. భారీ వర్షాలతో నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో అథ్లెట్ల భద్రతను దృష్టిలో పెట్టుకుని అత్యవసర చర్యలు చేపట్టారు. క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతి ప్రాంతాల్లోని వారిని ముందు జాగ్రత్తగా ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించారు. షిప్పింగ్ కంటైనర్లతో ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతి కేంద్రాల్లో ఉన్నవారిని కూడా మార్చినట్లు సమాచారం. దాదాపు 400 మంది క్రీడాకారులు, ఇతర సిబ్బంది తాత్కాలిక ఆశ్రయ కేంద్రాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అథ్లెట్లందరూ సురక్షితంగానే ఉన్నారని జపాన్ అధికారులు వెల్లడించారు. వర్షాలు, వరదల కారణంగా క్రీడా వేదికలకు ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదని పేర్కొన్నారు.

### రవాణాపై వర్షాల దెబ్బ

నాగోయాలోని పలు ప్రాంతాలు నీటమునగడంతో ప్రజా రవాణాపైనా ప్రభావం పడింది. కొన్ని సబ్‌వే, బస్సు సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు సమాచారం. మరింత భారీ వర్షం కురిసే అవకాశం ఉండటంతో స్థానిక యంత్రాంగం అప్రమత్తమైంది. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టింది. ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు జరగనున్న నేపథ్యంలో వివిధ దేశాలకు చెందిన క్రీడాకారులు జపాన్‌కు చేరుకుంటున్నారు. దీంతో వాతావరణ పరిస్థితులను నిర్వాహకులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రస్తుతానికి ఆసియా క్రీడల నిర్వహణకు ముప్పు లేదని అధికారులు చెబుతున్నప్పటికీ.. భారీ వర్షాలు కొనసాగితే ఏర్పడే పరిస్థితులపై ఆందోళన నెలకొంది. అథ్లెట్ల భద్రతతో పాటు రవాణా, వసతి ఏర్పాట్లు ఇప్పుడు నిర్వాహకులకు ప్రధాన సవాల్‌గా మారాయి.




# హోరాహోరీ పోరులో ఆల్కరాజ్ ఔట్..

## యూఎస్ ఓపెన్ సెమీస్‌లోకి బెన్ షెల్టన్

**న్యూయార్క్:** యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ నుంచి డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కరాజ్ నిష్క్రమించాడు. ఇవాళ హోరాహోరీగా జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అమెరికన్ ప్లేయర్ బెన్ షెల్టన్ అద్భుత విజయాన్ని నమోదు చేశాడు. అయిదు సెట్ల థ్రిల్లింగ్ మ్యాచ్‌ను 6-7(5), 6-1, 6-3, 1-6, 7-6(7) స్కోరుతో షెల్టన్ గెలుచుకున్నాడు. మడిమ గాయం నుంచి కోలుకుని టోర్నీలో అడుగుపెట్టిన అల్కరాజ్.. ఈ మ్యాచ్‌లో చివరి వరకు పోరాడు. సుమారు 4 గంటల 28 నిమిషాల పాటు ఈ మ్యాచ్ జరిగింది. అల్కరాజ్‌పై తన కెరీర్‌లో తొలిసారి విజయం సాధించాడు బెన్. నాలుగు నెలల గాయం తర్వాత అల్కరాజ్ ఆడిన ఫస్ట్ టోర్నీ ఇదే. కానీ అతని ఆశలపై నీళ్లు చల్లాడు యువ ప్లేయర్ షెల్టన్. గాయం వల్ల స్పెయిన్ ప్లేయర్ అల్కరాజ్ సరైన రీతిలో తన సత్తాను ప్రదర్శించలేకపోయాడు. సమారు 52 అన్‌ఫోర్స్‌డ్ ఎర్రర్స్ చేశాడు. టై బ్రేకర్ వరకు వెళ్లిన తొలి సెట్‌ను అల్కరాజ్ చివరకు సొంతం చేసుకున్నాడు. కానీ ఆ తర్వాత చాలా భీకరంగా షెల్టన్ చెలరేగిపోయాడు. రెండవ, మూడవ సెట్లను బెన్ ఈజీగా నెగ్గేశాడు. ఫోర్‌హ్యాండ్ షాట్లతో ఆకట్టుకున్నాడు. కానీ నాలుగో సెట్‌లో అల్కరాజ్ తన రిథమ్‌ను మళ్లీ అందుకున్నాడు. బేస్‌లైన్ షాట్లు, స్పీడ్‌తో ఆ సెట్‌ను 6-1 తేడాతో నెగ్గి మ్యాచ్‌ను డిసైడర్ సెట్‌లోకి పంపాడు. ఇక ఆ ఫైనల్ సెట్‌లో ఇద్దరూ అమీతుమీ అన్నట్లుగా ఆడారు. సూపర్ టైబ్రేక్‌కు ఆ సెట్ వెళ్లింది. స్టేడియంలో మ్యాచ్‌ను వీక్షిస్తున్న ప్రేక్షకులు తీవ్ర ఉత్కంఠకు లోనయ్యారు. కానీ చివరకు బెన్ షెల్టన్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. 10-7తో టైబ్రేక్ సాధించాడు. దీంతో అతను రెండోసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌లోకి ప్రవేశించాడు. న్యూయార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియంలో క్వార్టర్స్ మ్యాచ్‌ను ఆలస్యంగా ప్రారంభించారు. దీనికి తోడుగా 4 గంటలకు పైగా మ్యాచ్ సాగడం వల్ల.. తెల్లవారుజామున మూడున్నరకు మ్యాచ్ ముగిసింది.

# బిగ్‌బాష్‌లోకి ప్రైవేట్ ఎంట్రీ

- ఐపీఎల్ ఓనర్లకు బంపర్ ఛాన్స్!
- ప్రైవేట్ పెట్టుబడులకు క్రికెట్ ఆస్ట్రేలియా గ్రీన్‌సిగ్నల్
- 2027-28 సీజన్ నుంచి కొత్త యాజమాన్య విధానం
- తొలుత మెల్‌బోర్న్ రెనెగేడ్స్ విక్రయానికి రంగం సిద్ధం
- ప్రపంచ టీ20 మార్కెట్‌లో ఐపీఎల్ యజమానులకు మరో అవకాశం
- నియంత్రణ మాత్రం క్రికెట్ ఆస్ట్రేలియా చేతుల్లోనే



**మెల్‌బోర్న్, సెప్టెంబర్ 9 (చురకలు):** ఆస్ట్రేలియా క్రికెట్‌లో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. దేశంలో అత్యంత ఆదరణ పొందిన బిగ్‌బాష్ లీగ్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరిచేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా సిద్ధమైంది. 2027-28 సీజన్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుండగా.. మెల్‌బోర్న్ రెనెగేడ్స్‌ను తొలిసారిగా పూర్తిస్థాయి ప్రైవేట్ యాజమాన్యానికి అప్పగించే దిశగా అడుగులు పడుతున్నట్లు సమాచారం. ఈ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా పలు టీ20 జట్లను కలిగి ఉన్న ఐపీఎల్ ఫ్రాంచైజీ యజమానులకు మరో భారీ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఇప్పటివరకు ప్రపంచంలోని ప్రధాన టీ20 లీగ్‌లతో పోలిస్తే బిగ్‌బాష్‌లో ప్రైవేట్ ఫ్రాంచైజీ యాజమాన్యానికి అవకాశం లేకపోవడం ప్రత్యేకత. తాజా నిర్ణయంతో ఆ పరిస్థితి మారనుంది. అయితే బిగ్‌బాష్‌ను పూర్తిగా ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెట్టకుండా కీలక నియంత్రణలను క్రికెట్ ఆస్ట్రేలియానే కొనసాగించనున్నట్లు సమాచారం.

### ఐపీఎల్ ఓనర్ల కన్ను పడితే..!

ఐపీఎల్ జట్ల యజమానులు ఇప్పటికే దక్షిణాఫ్రికా, యూఏఈ, అమెరికా, వెస్టిండీస్, ఇంగ్లండ్ సహా వివిధ దేశాల్లోని టీ20 లీగ్‌ల్లో పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు ఆస్ట్రేలియా మార్కెట్ కూడా అందుబాటులోకి వస్తే ప్రపంచ టీ20 క్రికెట్‌లో వారి వ్యాపార సామ్రాజ్యం మరింత విస్తరించే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, ఆర్‌పీ-సంజీవ్ గోయెంకా గ్రూప్, జీఎంఆర్-జేఎస్‌డబ్ల్యూ వంటి సంస్థలు ఇప్పటికే వివిధ దేశాల్లో ఫ్రాంచైజీలను నిర్వహిస్తున్నాయి. బిగ్‌బాష్‌లోనూ జట్లను సొంతం చేసుకుంటే ఒకే యాజమాన్యం కింద వివిధ లీగ్‌ల్లో ఆటగాళ్లను కొనసాగించే వ్యూహాలకు మరింత అవకాశం లభించవచ్చు.

### ఒకే బ్రాండ్.. పలు లీగ్‌లు

కామెరాన్ గ్రీన్, టిమ్ డేవిడ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్ వంటి అంతర్జాతీయ ఆటగాళ్లను ఒకే యాజమాన్యానికి చెందిన ఐపీఎల్, ఎస్‌ఏ20, మేజర్ లీగ్ క్రికెట్, బిగ్‌బాష్ జట్లలో ఒప్పందాల ద్వారా కొనసాగించే అవకాశాలు పెరగవచ్చు. తద్వారా ఆటగాళ్ల నిర్వహణతో పాటు ఒకే బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించుకునేందుకు ఫ్రాంచైజీలకు అవకాశం ఉంటుంది. అయితే ఇక్కడే మరో సమస్య ఉంది. బిగ్‌బాష్ సాధారణంగా డిసెంబర్--జనవరిలో జరుగుతుండగా అదే సమయంలో దక్షిణాఫ్రికా ఎస్‌ఏ20, యూఏఈ అంతర్జాతీయ లీగ్ టీ20 కూడా జరుగుతాయి. ఒకే యాజమాన్యానికి వివిధ లీగ్‌ల్లో జట్లు ఉంటే స్టార్ ఆటగాళ్లను ఏ జట్టుకు కేటాయించాలన్న విషయంలో అంతర్గత పోటీ తప్పకపోవచ్చు.

### భారత స్టార్లకు మాత్రం నో ఎంట్రీ

ఐపీఎల్ యజమానులు బిగ్‌బాష్ జట్లను కొనుగోలు చేసినా భారత పురుష క్రికెటర్లను అక్కడ ఆడించడం ప్రస్తుత నిబంధనల ప్రకారం సాధ్యం కాదు. భారత క్రికెట్ నియంత్రణ మండలి తన క్రికెటర్లు విదేశీ టీ20 లీగ్‌ల్లో పాల్గొనేందుకు సాధారణంగా అనుమతించడం లేదు. అయితే భారత మహిళా క్రికెటర్లు గతంలో బిగ్‌బాష్‌లో పాల్గొన్నారు. భవిష్యత్తులో రిటైర్డ్ లేదా ఒప్పంద పరిధిలో లేని పురుష ఆటగాళ్ల విషయంలో భారత బోర్డు నిబంధనలు సడలిస్తే బిగ్‌బాష్‌లో పెట్టుబడులు పెట్టే భారత ఫ్రాంచైజీలకు అదనపు ప్రయోజనం కలిగే అవకాశం ఉంది.

### పగ్గాలు మాత్రం సీఏ చేతుల్లోనే

ప్రైవేట్ పెట్టుబడులకు అవకాశం కల్పించినా బిగ్‌బాష్‌పై క్రికెట్ ఆస్ట్రేలియా నియంత్రణ కొనసాగనుంది. అంతర్జాతీయ క్రికెట్ షెడ్యూల్, ఆటగాళ్ల లభ్యత, ప్రసార హక్కులు, జీతాల పరిమితి వంటి కీలక అంశాల్లో బోర్డుదే ప్రధాన పాత్రగా ఉండనుంది. ఫ్రాంచైజీలను కొనుగోలు చేయాలనుకునే సంస్థలను ఆమోదించడం లేదా తిరస్కరించే అధికారం కూడా క్రికెట్ ఆస్ట్రేలియాకే ఉండనున్నట్లు సమాచారం. యాజమాన్య వైవిధ్యాన్ని కాపాడేందుకు ఒకే దేశానికి లేదా ఒకే వర్గానికి చెందిన సంస్థలు ఎన్ని జట్లను సొంతం చేసుకోవచ్చన్న అంశంలోనూ పరిమితులు విధించే అవకాశముంది. మొత్తానికి బిగ్‌బాష్‌లో ప్రైవేట్ పెట్టుబడులకు తలుపులు తెరుచుకుంటే ప్రపంచ టీ20 క్రికెట్ వ్యాపారంలో మరో కీలక మార్పునకు నాంది పడనుంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజీలను విస్తరిస్తున్న ఐపీఎల్ యజమానులకు ఆస్ట్రేలియా మార్కెట్ ఇప్పుడు కొత్త ఆకర్షణగా మారే అవకాశముంది.

# 100 వికెట్ల క్లబ్‌లో రాబిన్సన్ 'స్పెషల్'!

- 24వ టెస్టులోనే వంద వికెట్ల మైలురాయి
- సయీమ్ అయూబ్‌ను ఔట్ చేసి ఘనత
- 20లోపు సగటుతో అరుదైన రికార్డు
- బుమ్రా సరసన ఇంగ్లండ్ పేసర్
- పాక్‌పై వరుసగా మూడో టెస్టులోనూ జోరు




**బర్మింగ్‌హామ్, సెప్టెంబర్ 9 (చురకలు):** ఇంగ్లండ్ పేసర్ ఓలీ రాబిన్సన్ టెస్టు క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించాడు. పాకిస్థాన్‌తో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా బుధవారం ప్రారంభమైన మూడో టెస్టులో సయీమ్ అయూబ్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి తన టెస్టు కెరీర్‌లో 100వ వికెట్‌ను పూర్తి చేసుకున్నాడు. 32 ఏళ్ల రాబిన్సన్‌కు ఇది 24వ టెస్టు కావడం విశేషం. అంతేకాదు.. 100 వికెట్ల మైలురాయి చేరే సమయానికి 20 కంటే తక్కువ బౌలింగ్ సగటు కలిగిన అత్యంత అరుదైన ఆధునిక బౌలర్ల జాబితాలో రాబిన్సన్ చోటు సంపాదించాడు. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం గత వందేళ్లలో 100 టెస్టు వికెట్లు తీసిన సమయంలో అత్యుత్తమ సగటు నమోదు చేసిన బౌలర్‌గా రాబిన్సన్ నిలిచాడు. జస్ప్రీత్ బుమ్రా పేరిట ఉన్న రికార్డును అధిగమించినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

### సయీమ్‌తోనే 'సెంచరీ'

టాస్ గెలిచిన ఇంగ్లండ్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. రాబిన్సన్ తన తొలి ఓవర్‌లోనే సయీమ్ అయూబ్‌ను ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసినప్పటికీ సమీక్షలో నిర్ణయం మారింది. అయితే తన తర్వాతి ఓవర్‌లోనే సయీమ్‌ను ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్‌కు పంపి 100వ వికెట్ మైలురాయిని అందుకున్నాడు.

### పాక్‌పై రాబిన్సన్ 'రాజ్'

ప్రస్తుత సిరీస్‌లో రాబిన్సన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. తొలి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఎనిమిది వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. రెండో టెస్టులోనూ 4-11, 4-24తో మరో ఎనిమిది వికెట్లు తీసి వరుసగా రెండోసారి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. రెండేళ్లకు పైగా టెస్టు జట్టుకు దూరంగా ఉండి తిరిగి వచ్చిన రాబిన్సన్.. ఇప్పుడు 100 వికెట్ల మైలురాయితో తన పునరాగమనాన్ని మరింత ప్రత్యేకంగా మార్చుకున్నాడు.


# రూ.130 కోట్లకు పైగా డీల్!

## బీసీసీఐతో చాట్‌జీపీటీ, క్యాంపా, ఎస్‌బీఐ లైఫ్ ఒప్పందం

- మూడు దిగ్గజ బ్రాండ్లు అసోసియేట్ పార్ట్‌నర్లుగా ఎంపిక
- రూ.130 కోట్లకు పైగా ఆదాయంతో 44 శాతం వృద్ధి
- 2028 మార్చి వరకు భారత్‌లో జరిగే మ్యాచ్‌లకు వర్తింపు




**ముంబై, సెప్టెంబర్ 9 (చురకలు):** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తమ స్వదేశీ క్రికెట్ సీజన్‌కు సంబంధించి ప్రముఖ పానీయాల బ్రాండ్ 'క్యాంపా', ఇన్సూరెన్స్ సంస్థ 'ఎస్‌బీఐ లైఫ్'తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ 'చాట్‌జీపీటీ'లను అసోసియేట్ పార్ట్‌నర్లుగా ప్రకటించింది. రాబోయే వెస్టిండీస్ సిరీస్‌తో ప్రారంభమై 2028 మార్చి వరకు (మొత్తం 35 మ్యాచ్‌లకు) ఈ భాగస్వామ్యం అమల్లో ఉండనుంది. ఈ రెండు సీజన్ల ఒప్పందం ద్వారా బీసీసీఐకి రూ.130 కోట్లకు పైగా ఆదాయం లభించనుండగా, గత సైకిల్‌తో పోలిస్తే ఒప్పంద విలువ ఏకంగా 44 శాతం పెరగడం విశేషం. బిడ్డింగ్‌లో క్యాంపా కోలా మ్యాచ్‌కు రూ.1.31 కోట్లు, ఎస్‌బీఐ లైఫ్ మరియు చాట్‌జీపీటీ మ్యాచ్‌కు రూ.1.2 కోట్ల చొప్పున బిడ్లు దాఖలు చేసి భాగస్వామ్య హక్కులను సొంతం చేసుకున్నాయి. ఈ సందర్భంగా బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, గౌరవ కార్యదర్శి దేవజిత్ సైకియా మాట్లాడుతూ.. ఏఐ, ఇన్సూరెన్స్, బెవరేజెస్ వంటి విభిన్న రంగానికి చెందిన అంతర్జాతీయ బ్రాండ్లు భారత క్రికెట్‌పై చూపుతున్న నమ్మకానికి ఈ భారీ డీల్ నిదర్శనమని తెలిపారు. భారత హోమ్ సీజన్ మార్కెట్‌లో ఎంతటి క్రేజ్, డిమాండ్ ఉందో ఈ 44 శాతం వృద్ధి స్పష్టం చేస్తోందని వారు ఆనందం వ్యక్తం చేశారు. గ్రౌండ్ బ్రాండింగ్, బ్రాడ్‌కాస్ట్ గ్రాఫిక్స్ ద్వారా ఈ బ్రాండ్లు ప్రచారం పొందనున్నాయి.



# డూప్ వద్దు.. నేనే దూకేస్తా

## 'సర్దార్ 2' సెట్స్‌లో మాళవిక సాహసం


హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు): నటుడు కార్తి కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'సర్దార్ 2' చిత్రంలో నటిస్తున్న భామ మాళవిక మోహనన్ యాక్షన్ సన్నివేశాల్లో డూప్ (బాడీ డబుల్) లేకుండా నటించి చిత్ర బృందాన్ని ఆశ్చర్యపరిచింది. పి.ఎస్. మిత్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ తొలిరోజే రోప్‌ల సాయంతో ఎత్తైన ప్రదేశం నుండి స్విమ్మింగ్ పూల్‌లోకి దూకే రిస్కీ సీన్ ఇచ్చారని, డూప్‌ను వద్దని చెప్పి స్వయంగా తానే ఆ స్టంట్‌ను పూర్తి చేసినట్లు మాళవిక వెల్లడించింది. జిమ్నాస్టిక్స్, 'తంగలాన్' సినిమా కోసం నేర్చుకున్న కర్రసాము శిక్షణ ఈ స్టంట్ చేయడానికి తనకు ఎంతగానో ఉపయోగపడ్డాయని తెలిపింది. యాక్షన్ సీన్స్ అలవోకగా చేయడంలో సీనియర్ నటుడు విక్రమ్ ఇచ్చిన సలహాలు, తోటి నటుడు ఎస్.జె. సూర్య నటన తనకు ఎంతో స్ఫూర్తినిచ్చాయని, భవిష్యత్తులో పవర్‌ఫుల్ లేడీ విలన్ పాత్రలు చేయడానికి కూడా తాను సిద్ధమేనని ప్రకటన చేసింది. కథానాయకుడు కార్తి ఎంతో జోవియల్, మంచి మనసున్న వ్యక్తి అని, తెలుగు ప్రేక్షకులకు ఆయన దత్తపుత్రుడి లాంటి వారని కొనియాడింది. గ్రాండ్ విజువల్స్, బ్యాంకాక్‌లో చిత్రీకరించిన మైండ్ బ్లోయింగ్ యాక్షన్ ఎపిసోడ్స్‌తో ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'సర్దార్ 2' చిత్రం సెప్టెంబర్ 10న థియేటర్లలోకి వస్తోందని మాళవిక స్పష్టం చేసింది.

# రణబాలి టీజర్‌లో విజయ్ విశ్వరూపం




హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు): విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం 'రణబాలి' టీజర్‌ను చిత్రబృందం బుధవారం విడుదల చేసింది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం 1854 నుంచి 1878 మధ్య కాలంలో బ్రిటిష్ పాలనలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా, ఫిక్షన్ అంశాలను జోడించి రూపొందిస్తున్నట్లు టీజర్ చూస్తే తెలుస్తోంది. ఇందులో విజయ్ దేవరకొండ విశ్వరూపం చూపించగా, కథలోని యాక్షన్, పీరియాడిక్ డ్రామా ప్రేక్షకుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ సినిమాలో విజయ్ సరసన రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండగా, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ పవర్‌ఫుల్ ప్రతినాయక పాత్రలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి టీ-సిరీస్ సమర్పణలో అజయ్-అతుల్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ భారీ పిరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను దసరా కానుకగా అక్టోబర్ 16న తెలుగు, హిందీతో పాటు ప్రధాన భారతీయ భాషల్లో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.







# 'ముద్దు సీన్ ఉంటే అడల్ట్ సినిమానా?'

## 'ఎపిక్' ట్రోలింగ్‌పై నాగవంశీ స్ట్రాంగ్ కౌంటర్

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు): యువ హీరో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటించిన 'ఎపిక్' సినిమా ట్రైలర్‌లోని రొమాంటిక్, ముద్దు సన్నివేశాలపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ట్రోలింగ్‌కు నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఘాటుగా స్పందించారు. సినిమాలో ముద్దు సన్నివేశం కనిపించినంత మాత్రాన దానిని 'అడల్ట్ సినిమా'గా ముద్ర వేయడం సరికాదని అన్నారు. సినిమా పూర్తిగా చూసిన తర్వాతే దానిపై అభిప్రాయానికి రావాలని సూచించారు. 'బేబీ' తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మరోసారి జంటగా నటించిన చిత్రం 'ఎపిక్'. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలతో సినిమాపై యువతలో ఆసక్తి పెరగగా.. ట్రైలర్‌లోని కొన్ని రొమాంటిక్ సన్నివేశాలపై విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో ఈ ట్రోలింగ్‌పై నాగవంశీ స్పందించారు. కార్యక్రమానికి వచ్చిన కొందరు ప్రేక్షకులను వేదికపైకి పిలిచి ట్రైలర్‌లోని రొమాంటిక్ సన్నివేశాలపై వారి అభిప్రాయాలను అడిగారు. అనంతరం సామాజిక మాధ్యమాల్లో వస్తున్న విమర్శలకు సమాధానమిచ్చారు. ఒకటి రెండు సన్నివేశాలను చూసి మొత్తం సినిమాపై ఓ నిర్ణయానికి రావడం సరికాదన్నారు. 'ఎపిక్' కేవలం రొమాంటిక్ సన్నివేశాల చుట్టూ తిరిగే చిత్రం కాదని, నేటి యువత ఆలోచనలు, ప్రేమ, భావోద్వేగాలను ప్రతిబింబించే కథగా తెరకెక్కించినట్లు చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారానికి భిన్నంగా 'ఎపిక్'ను కుటుంబ ప్రేక్షకులు కూడా కలిసి చూసి ఆస్వాదించవచ్చని నాగవంశీ తెలిపారు. సినిమాలో రొమాన్స్ కథలో భాగంగానే ఉంటుందని, దానిని మాత్రమే పట్టుకుని సినిమాపై ఒక అభిప్రాయానికి రావద్దన్నారు. యువతకు కనెక్ట్ అయ్యే అంశాలతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలు కూడా ఉంటాయని పేర్కొన్నారు.

# బాలయ్య-కొరటాల మూవీలో ఇద్దరు ఐశ్వర్యలు


## మేకోవర్ చూస్తే షాకే!

## తొలి షెడ్యూల్ అక్టోబర్‌లో షురూ

హైదరాబాద్, సెప్టెంబర్ 9 (చురకలు): నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న క్రేజీ ప్రాజెక్ట్ (ఎన్‌బీకే 112) పై టాలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో బాలకృష్ణను కేవలం మాస్ యాంగిల్‌కే పరిమితం చేయకుండా, మునుపెన్నడూ చూడని సరికొత్త మేకోవర్‌తో, కొత్త షేడ్స్‌లో చూపించేందుకు కొరటాల శివ ప్లాన్ చేస్తున్నారు. ఈ భారీ చిత్రానికి సంబంధించిన తొలి షూటింగ్ షెడ్యూల్ అక్టోబర్ మొదటి వారం నుంచి ప్రారంభం కానుండగా, బాలకృష్ణ లేని కీలక సన్నివేశాలు మరియు 15 రోజుల పాటు సాగే హై-వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్లను ప్రత్యేక సెట్‌లో చిత్రీకరించనున్నారు. ఇక ఈ చిత్రంలో కథానాయికగా మలయాళ నటి ఐశ్వర్య లక్ష్మి పేరును చిత్రయూనిట్ దాదాపు ఖరారు చేసినట్లు ఫిల్మ్‌నగర్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. 'సంబరాల ఏటిగట్టు'తో పాటు పలు చిత్రాల్లో నటిస్తున్న ఆమెకు బాలయ్య సరసన నటించే అవకాశం దక్కడం కెరీర్‌కు పెద్ద మలుపుగా మారనుంది. మరొక ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఈ సినిమాలో కీలకమైన 'లేడీ విలన్' పాత్ర కోసం ప్రముఖ నటి ఐశ్వర్య రాజేష్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా, ఐశ్వర్య రాజేష్ నెగెటివ్ షేడ్‌లో నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై మరింత ఉత్కంఠ నెలకొంది. ఈ నటీనటుల వివరాలపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశముంది.







This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com